ప్రజాశక్తి

శనివారం 15 మార్చి 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్ కృష్ణా





విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా

అసెంబ్లీలో తీర్మానించాలి

ధర్నాలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్య వేదిక డిమాండ్

ప్రజాశక్తి - విజయవాడ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజి మోస పూరితమని, స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు, నిర్వహణ నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్య వేదిక ఆధ్వర్యాన విజయవాడ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈధర్నాలో రాష్ట్ర మాజీ మంత్రి, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాదీశ్వరరావు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట ఐక్య వేదిక రాష్ట్ర చైర్మన్ సిహెచ్.నరసింగరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాధ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని తెలుగుదేశం కూటమి నాయకులు విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఎన్నికల అనంతరం విశాఖ ఉక్కు పరిశ్రమ కార్మిక నాయకులకు రాతపూర్వకంగా ఇచ్చిన మాట నిలబెట్టుకోలేదని విమర్శించారు. 32 మంది ప్రాణాల బలిదానంతో తెలుగు ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేటీకరించొద్దని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానించాలని డిమాండ్ చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందని, ఆ నిధులు ప్లాంట్‌ని కాపాడుకోవడం కోసమే అనటం విడ్డూరంగా ఉందని అన్నారు. కేటాయించిన నిధులు కేవలం బకాయిపడిన వేతనాలు చెల్లించడానికి మాత్రమే సరిపోతాయన్నారు. ఉత్పత్తి పెరగాలన్నా, కొత్తగా కార్మికులను రిక్రూట్ చేసుకోవాలన్నా, కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలన్నా నిధులు సరిపోవన్నారు. ప్లాంట్‌ని కాపాడుకోవాలంటే సంస్థకు సొంత గనులు, నిర్వహణ నిధులు కేటాయించాలని కోరారు. ఎన్డీఏ కూటమి నేతృత్వంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ చిత్త శుద్ధిని పార్లమెంటు, అసెంబ్లీ తీర్మానాల ద్వారా దేశ ప్రజానీకానికి, ప్రత్యేకంగా ఆంధ్ర ప్రజలకు విశ్వాసాన్ని కల్పించాలన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న విశాఖ ఉక్కు రక్షణ కోసం (మిగతా 2లో)

సచివాలయాల నిర్మాణంపై

నిర్లక్ష్యం

● నిర్మించాల్సినవి 387 ● పూర్తయినవి 212 ● రూ.14 కోట్లు కేటాయిస్తే మరో 100 కార్యాలయాలు పూర్తి

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

వార్డు, గ్రామ సచివాలయ వ్యవస్థపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోంది. ఇప్పటికే వాలంటీర్లను పక్కన పెట్టిన ప్రభుత్వం నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాలపై శీతకన్ను వేసింది. టిడిపి కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన ప్రణాళికల్లోనూ మార్పులు చోటుచేసుకుంటున్నాయి. దీంతో క్షేత్రస్థాయిలోనూ వాటి ప్రభావం పడుతోంది. గ్రామ, వార్డు సచివాలయాల నిర్మాణంలో నిర్లక్ష్యమే దీనికి నిదర్శంగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం రాగానే వీటి నిర్మాణాలను పక్కనపెట్టింది. వివిధ దశల్లో ఉన్న సచివాలయ నిర్మాణాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది.

సచివాలయాల నిర్మాణ పరిస్థితి ఇలా

కృష్ణాజిల్లా ఘంటసాల మండలం చిట్టూర్పులో నిర్మిస్తున్న గ్రామ సచివాలయం రెండు స్లాబులు పూర్తయ్యాయి. చల్లపల్లి మండలం వక్కలగడ్డ పంచాయతీ ప్రాంగణంలో నిర్మిస్తున్న సచివాలయం పునాదుల దశలోనే మిగిలింది. ఈ రెండు సచివాలయాలు మాత్రమే కాదు...జిల్లా వ్యాప్తంగా 175 గ్రామ పంచాయతీల్లోని సచివాలయాలు ఇదే పరిస్థితుల్లో ఉన్నాయి. ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఇప్పుడు వీటి నిర్మాణం సందిగ్ధంలో పడింది. ఇవి ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. రూ.14 కోట్లు కేటాయిస్తే అందుబాటులోకి 100 సచివాలయాలు



పునాదుల దశలోనే నిలిచిపోయిన చల్లపల్లి మండలం వక్కలగడ్డ పంచాయతీ ప్రాంగణంలో నిర్మిస్తున్న సచివాలయం

జాతీయ ఉపాధి హామీ చట్టం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో జిల్లాలో 387 గ్రామ సచివాలయాల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించారు. సచివాలయానికి రెండు స్లాబుల భవనాన్ని నిర్మించడానికి సగటున (మిగతా 2లో)



ప్రమాదం జరిగిన వాహనం నుంచి మృతదేహాలను బయటకు తీస్తున్న ఎస్ఐ, పోలీస్ సిబ్బంది

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

ప్రజాశక్తి - ఘంటసాల : కృష్ణాజిల్లా ఘంటసాల మండలం యందుకుదురు శివారు జీలగలగండి వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం పాలయ్యారు. లారీని బొలెరో వాహనం ఢీ కొట్టిన ప్రమాదంలో ఇరువురు వ్యక్తులు అక్కడికక్కడే మరణించారు. శుక్రవారం తెల్లవారుజామున నాలుగున్నర గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం జువ్వలపాలెం గ్రామానికి చెందిన కోట వరప్రసాద్(50), చీపురుపల్లి శివకృష్ణ (29) బొలెరో వాహనంలో చేప పిల్లల లోడ్‌తో చల్లపల్లి వైపు నుంచి బందరు వెళుతున్నారు. అస్సాం నుంచి సరుకు బాదుల లోడుతో లారీ చీరాల వెళుతోంది. ఈక్రమంలో బొలెరో వాహనం జీలగలగండి వద్ద (మిగతా 2లో)

నేటి నుండి ఒంటి పూట బడులు

ప్రజాశక్తి - కలెక్టరేట్ (కృష్ణా) :

ఈనెల 15వ తేదీ నుండి పాఠశాలలు ఒక పూట మాత్రమే నిర్వహించనున్నట్లు కృష్ణాజిల్లా విద్యా శాఖాధికారి పి.వి.జె.రామారావు తెలిపారు. జిల్లాలోని అన్ని యజమాన్యాల పాఠశాలలు ఈనెల 15 నుండి ఏప్రిల్ 23వ తేదీ వరకు ఒంటి పూటే బడులు ఉంటాయని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం చివరి పని దినం వరకు ఉదయం 7.45 నుండి మధ్యాహ్నం 12.30 వరకు పాఠశాలల నిర్వహణ ఉంటుందని తెలిపారు. పదో తరగతి పరీక్షలు జరిగే పాఠశాలలకు మాత్రం పాఠశాలల పని సమయం మధ్యాహ్నం 1 గంట నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించాలని డిఇఒ ఆదేశించారు.

శీతకన్ను

● ముందుకు సాగని ఏనుగు గడ్డ వాగు వంతెన నిర్మాణం

● ప్రభుత్వాలు మారుతున్నా ఫలితం శూన్యం

ప్రజాశక్తి - వీరులపాడు : ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలం చెన్నారావుపాలెం గ్రామంలో ఏనుగు గడ్డ వాగుపై వంతెన నిర్మించాలని రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులు వ్యవసాయ భూముల్లో పనులు చేయడానికి ఏనుగడ్డ వాగుపై నుండే గ్రామ ప్రజలు వెళ్లాల్సి వస్తోంది. వర్షాకాలం వచ్చిందంటే ఈ వాగుకు తెలంగాణ నుండి పెద్దఎత్తున వరదలు వచ్చి రాకపోకలకు ఆంతరాయం కలుగుతోంది. దీంతో రైతులు, వ్యవసాయ కార్మికులు వరద తగ్గేవరకు వారం నుండి పది రోజుల వరకు ఎటువంటి పనులకు వెళ్లకుండా ఉండాల్సి వస్తోంది. దీంతో ఆ ప్రాంత రైతులు, ప్రజలు కొన్నేళ్లుగా ఏనుగు గడ్డ వాగుపై వంతెన నిర్మించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నారు. అయిదే ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా ఏనుగు గడ్డ వాగుపై వంతెన నిర్మాణం జరగడంలేదని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2018లో ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో టిడిపి ప్రభుత్వం రైతుల పంట పొలాలకు వెళ్లేందుకు రూ.1.30 కోట్లు నిధులు మంజూరు చేసి వంతెనకు శంకుస్థాపన చేశారు. అయినా వంతెన నిర్మాణం చేపట్టలేదు. అప్పటి భారీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, నందిగామ శాసనసభ్యురాలు తంగిరాల సౌమ్యపై చెన్నారపాలెం గ్రామ రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కొద్దిరోజులకే ఎన్నికలు రావడంతో 2019లో రాష్ట్రంలో టిడిపి ఓడిపోయి వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి అధికారంలోకి వచినా వంతెన నిర్మాణం జరగలేదు. ఇప్పుడు టిడిపి కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో ఇప్పటికైనా వంతెన నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

ఏనుగు వాగు రహదారి; వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసిన శిలాఫలకం (అంతర్‌చిత్రంలో)



వర్షాకాలంలో అనేక ప్రమాదాలు : రాయల శ్రీనివాసరావు



దశాబ్ద కాలంగా వంతెన నిర్మాణం జరగకపోవడంతో వర్షాకాలంలో వరదలకు అనేకమంది ప్రమాదాలకు గురయ్యారు. పశువుల జాడ తెలియక రైతులు నానా ఇబ్బంది పడ్డారు. ప్రతియేటా వ్యవసాయ పంటలు, ధాన్యం, రైతులు చేరుకోవడానికి వంతెన లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా త్వరగా వంతెన నిర్మాణం చేపట్టి రైతులను ఆదుకోవాలి.

రైతులకు ఇబ్బందులు : మల్లెల గోపి

వంతెన నిర్మాణం చేపట్టకపోవడం వల్ల రైతులు పలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వాలు మారినా వంతెన నిర్మాణం చేపట్టకపోవటం దురదృష్టకరం. కూటమి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.



పశువుల మేతకూ ఇక్కట్లే : బాణావతి బాలాజీ నాయక్

వర్షాకాలంలో గొర్రెలు, మేకలను మేతకు తీసుకెళ్లటానికి ఇబ్బందులు తప్పడంలేదు. రహదారి సౌకర్యం లేకపోవడంతో జీవాలకు సరైన సమయంలో మేత అందడం లేదు. జీవాలు మృతి చెందుతున్నాయి. అందువల్ల వంతెన నిర్మాణం వెంటనే చేపట్టాలి.





15-3-2025 శనివారం

ఇఫ్తార్ (సాయంత్రం) : 6.23

16-03-2025 ఆదివారం

సహర్ (ఉదయం) : 4.58

ఇఇఎఫ్ఐ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా లకనం రాజు ఎన్నిక

ప్రజాశక్తి - విజయవాడ



ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఇఇఎఫ్ఐ) జాతీయ కౌన్సిల్ సభ్యులుగా విజయవాడకు చెందిన లకనం రాజు ఎన్నికయ్యారు. ఇఇఎఫ్ఐ 10వ జాతీయ మహాసభ కేరళ రాజధాని తిరువనంతపురంలో 3 రోజులపాటు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. ఈనెల 10 నుండి 12వ తేదీ జరిగిన ఈ మహాసభకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి కేంద్ర, రాష్ట్ర విద్యుత్ సంస్థల్లో ఎన్‌టిపిసి, పవర్ గ్రిడ్, ట్రాన్స్‌కో, జెన్ కో, డిస్కంల నుండి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుండి 22 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ మహాసభలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఎపిసిపిడిసిఎల్ డిస్కం ప్రధాన కార్యదర్శి లకనం రాజు ఫెడరేషన్ కౌన్సిల్ సభ్యులుగా ఎన్నికయ్యారు.

డాక్టర్ బ్రహ్మాజీ మృతికి సంతాపం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియా లాజిస్ట్స్ (ఐఎస్ఎ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బ్రహ్మాజీ మతికి ఐఎస్ఎ రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ సంతాపం తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ సూరిశెట్టి, డాక్టర్ మాదన్నోహన్‌రెడ్డి, ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎన్ఎస్ఎస్ చక్రరావు, డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ నోరి వేణుగోపాల్, డాక్టర్ రెడ్డి ప్రసాద్ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు.

రేపు 'విద్యారంగం - ఆర్థిక సమస్యలు'పై సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యారంగం, ఆర్థిక సమస్యలపై ఈనెల 16న ఉదయం 10 గంటలకు విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో యుటిఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుని విజయవంతం చేయాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పిలుపునిచ్చారు. శుక్రవారం బ్రాడీపేటలోని యుటిఎఫ్ ఆఫీసులో ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, యుటిఎఫ్ నాయకులు సదస్సు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఉండేలాగా చూడాలని, అదేవిధంగా మిగిలిన ప్రాథమిక పాఠశాలల్ని యథావిధిగా కొనసాగించాలని, ప్రాథమికోన్నత పాఠశాలలను కొనసాగించాలని అన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ 12వ పిఆర్‌సి కమిటీని ఏర్పాటు చేసి, చైర్మన్‌ను నియమించాలని కోరారు. పెండింగ్ డిఎలు ప్రకటించాలని కోరారు.సదస్సులో ఉపాధ్యా యులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు ఎం. గోవిందు, ఎండి.షకీలాబేగం, బెల్లంకొండ ప్రసాదు, ఆడిట్ కమిటి సభ్యులు ఎం.కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ తారకప్రసాద్‌కు ఐఎస్ఎ సత్కారం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

గుణదల ఐఎస్ఐ ఆస్పత్రిలో 25 ఏళ్లపాటు సివిల్ సర్జన్ ఎనెస్తెటిస్ట్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్‌ను ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తేసియా లోజిస్ట్స్ (ఐఎస్ఎ) విజయవాడ సిటీ బ్రాంచ్ ఆధ్వర్యాన ఘనంగా సత్కరించారు. నగరంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఎ) హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో 30 సంవత్సరాలపాటు ఎనేస్తిటిస్ట్‌గా సేవలందించినందుకు గాను శాలువాతో సత్కరించి జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో సిటీ బ్రాంచ్ సెక్రెటరీ డాక్టర్ దివ్య రావెల, వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ కీర్తి, స్టేట్ ఇసి మెంబర్ డాక్టర్ శ్రీదేవి, ట్రెజరర్ డాక్టర్ పావన ఫణి, డాక్టర్ భీమేశ్వర్, జాతీయ పూర్వ అధ్యక్షులు డాక్టర్ రాజగోపాల్, డాక్టర్ కిరణ్, మాజీ హెచ్ఒడి డాక్టర్ దుర్గా ప్రసాద్, డాక్టర్ లక్ష్మీ నారాయణ తదితరులు తారకప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు.



డాక్టర్ తారక ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న ఐఎస్ఎ నాయకులు

కల్యాణ ఉత్సవానికి బందోబస్తు

హాజరుకానున్న సిఎం చంద్రబాబు

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్‌పి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తుళ్లూరు మండలం వెంకటపాలెంలో శనివారం జరిగే శ్రీవేంకటేశ్వరస్వామి కళ్యాణ ఉత్సవానికి సిఎం చంద్రబాబు నాయుడు, పలువురు వివిఐపిలు హాజరుఅవుతున్నందున భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్‌పి సతీష్‌కుమార్ తెలిపారు. మొత్తం వెయ్యి మంది పోలీసులు బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. వెంకటపాలెం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందికి బందోబస్తుకు సంబంధించి పలు సూచనలు చేసి, ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు గాని, ట్రాఫిక్ సమస్యలు గానీ తలెత్తకుండా ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉంటూ బందోబస్తు నిర్వహించాలని ఎస్‌పి సూచించారు. బందోబస్తు నిర్వహణకు వీలుగా సభ ప్రాంగణాన్ని సెక్టార్లుగా విభజించి, ప్రతి ఒక్క సెక్టార్కు అదనపు ఎస్పీ లేదా డిఎస్పీ స్థాయి అధికారులను ఇంచార్జీలుగా(బాధ్యులుగా) నియమించి వారికి సహాయకులుగా సిఐలను, ఎస్ఐలను పోలీస్ సిబ్బందిని కేటాయించారు. వీవీఐపిలు, వీఐపిలు, ప్రముఖులు, భక్తులు, సందర్శకుల వాహనాలకు సంబంధించి ప్రత్యేకమైన పార్కింగ్ ప్రదేశాలను కేటాయించామన్నారు. వాహనాల ట్రాఫిక్ సక్రమంగా నడవడానికి సమిష్టిగా విధులు నిర్వహిస్తూ, ఎక్కడైనా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమైతే వెంటనే పరిష్కరించాలి. భక్తుల రద్దీ దష్ట్యా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ క్యూలైన్ల వద్ద, వాహనాల రాకపోకల మార్గాల్లో ఎటువంటి అవాంతరాలు ఏర్పడకుండా చూసుకోవాలన్నారు. పలువురు అదనపు ఎస్‌పిలు, డిఎస్‌పిలు పాల్గొన్నారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎస్‌పి

డాక్టర్ దక్షిణామూర్తికి రాజారామ్ సాహితీ పురస్కారం

ప్రజాశక్తి-గుంటూరు

అభ్యుదయ సాహితీవేత్త, అరసం నాయకులు డాక్టర్ పరుచూరి రాజారామ్ జ్ఞాపకార్థం 2003 నుంచి ఆయన జయంతిని పురస్కరించుకొని అందజేస్తున్న సాహితీ పురస్కారాన్ని ఈ ఏడాది తెనాలికి చెందిన వైద్యులు, పాపులర్ సైన్స్ రచయిత డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తికి అందచేస్తున్నట్లు అరసం జిల్లా అధ్యక్షులు చెరుకుమల్లి సింగా ఒక ప్రకటనలో తెలియచేశారు.

రేపు కిడ్నీ వ్యాధులపై ఆరోగ్య సభ

ప్రజాశక్తి-గుంటూరు : అవగాహన సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16న కిడ్నీ సంబంధిత వ్యాధులపై స్థానిక అరండల్‌పేట 15/1, కుబేరా టవర్స్‌లోని సంస్థ కార్యాలయంలో ఆరోగ్య సభ నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

మొదటిపేజీ తరువాయి

సచివాలయాల నిర్మాణంపై నిర్లక్ష్యం

రూ.43.6 లక్షల వ్యయం అవుతుందని అంచనా. 212 గ్రామ పంచాయతీల్లో సచివాలయాల నిర్మాణం పూర్తయి అందుబాటులోకి వచ్చాయి. 19 గ్రామ పంచాయతీల్లో భవనాలకు రెండు స్లాబులు, ఆరు పంచాయతీల్లో ఒక స్లాబు వేయడం పూర్తయింది. రెండు స్లాబులు పూర్తయి కిటికీలు, దర్వాజాలు, రంగులు వేయాల్సినవి మరో 75 ఉన్నాయి. తాజాగా రూ.14 కోట్లు కేటాయిస్తే మొదటి, రెండు స్లాబులు, తుది దశలో ఉన్న 100 గ్రామ పంచాయతీల్లో సచివాలయ భవనాలు అందుబాటులోకి వస్తాయని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నివేదికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జాతీయ ఉపాధి హామీ చట్టం మెటీరియల్ కాంపోనెంట్ నిధులను గ్రామాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి కేటాయిస్తోంది. ఈ నేపథ్యంలో పంచాయతీల్లో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాల నిర్మాణం ముందుకు సాగడంలేదు.

అసెంబ్లీలో తీర్మానించాలి

ప్రజలు, ట్రేడ్ యూనియన్లు దీర్ఘకాలంగా పోరాడుతున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదన్నారు. అంతేగాక అనకాపల్లిలో మిట్టల్ కంపెనీ ఆధ్వర్యాన మరో ప్రైవేట్ స్టీల్ ప్లాంట్‌కు ప్రభుత్వం మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. పొమ్మన లేక పొగబెట్టేందుకే విశాఖ స్టీల్ ప్లాంట్‌కు పరోక్షంగా నష్టం కలిగిస్తున్నారని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే వైఖరిని కొనసాగిస్తే ప్రజల ఆగ్రహానికి గురి కాక తప్పదని హెచ్చరించారు. రాజకీయాలకు అతీతంగా అన్ని తరగతుల ప్రజానీకం విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకష్ణ పాల్గొని ఉద్యమానికి మద్దతు తెలిపారు. ఈకార్యక్రమంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రామకష్ణ, టియుసిఐ రాష్ట్ర అధ్యక్షులు మరీదు ప్రసాద్ బాబు తదితరులు ప్రసంగించారు. సిఐటియు ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు ఏ.వెంకటేశ్వరరావు, ఏఐటియుసి నగర అధ్యక్షులు సాంబశివరావు అధ్యక్షత వహించగా, సిఐటియు నాయకులు ఎ.కమల, కె.దుర్గారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం

లారీని బలంగా ఢీకొంది. బొలెరో వాహనం నుజ్జునుజ్జయి రోడ్డు కిందకు వెళ్లిపోయింది. ఆ వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసం కావడంతో అందులో ఉన్న కోట వరప్రసాద్, బీపురుపల్లి శివకృష్ణ అక్కడికక్కడే మరణించారు. సమాచారం అందుకున్న చల్లపల్లి సిఐ ఈశ్వరరావు, ఘంటసాల ఎస్ఐ ప్రతాపరెడ్డి సంఘటన ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికుల సాయంతో అతి కష్టం మీద మృతదేహాలను బయటకు తీసి మార్చురీకి తరలించారు. నిద్ర మత్తు కారణంగా ఈ ప్రమాదం జరిగి ఉంటుందని భావిస్తున్నారు.



మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- చల్లపల్లి. (మొవ్వ) : మొవ్వ మండల పరిధి లోని కూచిపూడి సెంటర్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం మొవ్వ మండల అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో జడ్పిటిసి కోఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు మజ్జిగ పంపిణీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ సర్పంచ్ తూము పూర్ణ చంద్రారావు, ప్రముఖులు కొండవీటి అమర బాలేశ్వర రావు, చిగురుపాటి ఏడుకొండలు, తూము అంబేద్కర్, రాజులపాటి రాఘవరావు, పులి వినోద్ బాబు తదితరులు పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

సొసైటీలో అవినీతిపై విచారణ : ఎంఎల్ఏ వెనిగండ్ల

ప్రజాశక్తి - గుడివాడ : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో గుడివాడ నియోజకవర్గంలో జరిగిన అవినీతిని మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి సిఐడి ఎంక్వైరీ కోరతానని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. గుడివాడ మున్సిపల్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌లో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణాన్ని సొసైటీ కార్మికులు శుక్రవారం ఉదయం ఆయన స్వగృహంలో ఎమ్మెల్యే రాము దృష్టికి తీసుకువచ్చారు. సొసైటీలో జరిగిన అవినీతిని సభ్యులు ఎమ్మెల్యే రాముకు తెలియజేశారు. 22ఏళ్ల క్రితం చనిపోయిన వ్యక్తిపై కూడా 2022లో 10 లక్షల రుణం తీసుకున్నారని కార్మికులు చెప్పడంతో ఎమ్మెల్యే రాము ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సభ్యులతో కలిసి సత్యనారాయణపురంలోని సొసైటీ కార్యాలయానికి వెళ్ళి పరిశీలించారు. రుణాల అవకతవకలపై గుమస్తా రాజును వివరణ అడిగారు. తాను నలుగురు సభ్యులకు చెందిన 40 లక్షలు వాడుకున్నానని, ఇతర సొసైటీ సభ్యుల రుణాల వివరాలన్నీ అధ్యక్షురాలు లక్ష్మీకే తెలుసని ఎమ్మెల్యేకు చెప్పడంతో, విషయం విన్న కార్మికులందరూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ చేసి దర్యాప్తు చేపట్టాలని వన్ టౌన్ పోలీసులకు సూచించారు. జరిగిన విషయాన్ని కలెక్టర్ దష్టికి తీసుకువెళ్లానని, విచారణ చేయిస్తానని ఆయన చెప్పారని ఎమ్మెల్యే రాము కార్మికులతో చెప్పారు.గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, కార్మిక సంఘ నాయకుడు వడ్డాది నాగరాజు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

కులంపేరుతో దూషించారని ఆందోళన

ప్రజాశక్తి-గన్నవరం : ఒక యువకుడ్ని కొట్టడమే కాకుండా కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం గన్నవరం పోలీస్ స్టేషన్ ఎదుట సూరంపల్లికి చెందిన సుగాలీలు ఆందోళన చేశారు. ఆ గ్రామం లోని సుగాలిపేట ఏరియాలో యువకులు, మహిళలు హెూలీ వేడుకల్లో భాగంగా రంగులు చిమ్ముకుంటున్న సమయంలో అటుగా వెళుతున్న అంగిరేకుల నాగరాజు షర్టుపై రంగు వేశారు. దీంతో అతను ఆగ్రహానికి లోనై సుగాలి కల్కి అని వ్యక్తిని గట్టిగా మందలించడంతో వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఆ వెంటనే నాగరాజు గన్నవరం పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశాడు. స్టేషన్ నుంచి రాజశేఖర్ అనే కానిస్టేబుల్ గ్రామంలోకి వైరి వర్గాలతో మాట్లాడుతున్న సమయంలో మళ్లీ గొడవ జరిగటంతో నాగరాజు రెచ్చిపోయి సుగాలీ యువకులను కులం పేరుతో దూషించాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. గన్నవరం స్టేషన్కు వచ్చి కేసు నమోదు చేయమని అడిగినా పోలీసులు వెంటనే స్పందించకపోవడంతో స్టేషన్ ఎదుట సుగాలీలు బైఠాయించి ఆందోళన చేశారు. సీఐ శివప్రసాద్ ఆదేశాల మేరకు ఎస్సై శ్రీధర్ రంగంలోకి దిగి బాధితుల నుంచి ఫిర్యాదు తీసుకున్నారు. దీంతో ఆందోళన విరమించారు.



స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న సుగాలీలు

గురుకులం తరలించొద్దని వినతి

ప్రజాశక్తి-కంకిపాడు : కంకిపాడు మండలంలోని ఈడుపుగల్లులో ఉన్న డాక్టర్ అంబేద్కర్ గురుకులం, ఐఐటి మెడికల్ అకాడమీ ఇక్కడే కొనసాగించాలని కోరుతూ ఉమ్మడి కృష్ణాజిల్లా గురుకులాల ఇంచార్జ్ మురళీకృష్ణకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతిపత్రం శుక్రవారం ఇచ్చారు. ఈసందర్భంగా ఎస్ఎఫ్ఐ కృష్ణాజిల్లా కార్యదర్శి ఎస్ సమరం మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలు, కళాశాలలు ఐఐటీ మెడికల్ అకాడమీలు నామమాత్రంగా ఉన్నాయని, అందులో ఒకే ఒక్కటి విద్యార్థినిలకు సంబంధించి ఈడుపుగల్లు డాక్టర్. అంబేద్కర్ గురుకులం ఐఐటి మెడికల్ అకాడమీ ఉందని, ఇది ప్రారంభించినప్పటి నుంచి నేటి వరకు ఇక్కడి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారన్నారు. అనేక మందిని తీర్చిదిద్ది ఇతర దేశాల్లో కూడా ఉద్యోగాలు చేసుకునే అవకాశాలు కల్పించిన ఏకైక గురుకులాలు ఈడుపుగల్లు గురుకులం అని, దానిని అద్దె భవనాలుగా నడిపించే ఆర్థిక స్వామత పేరుతో ఎన్టీఆర్ జిల్లా జి కొండూరు మండలం చింత కళ్ళు అనే గ్రామానికి తరలిస్తున్నామని అధికారులు చెప్పడం తగదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈడుపుగల్లు డాక్టర్ అంబేద్కర్ గురుకులం ఐఐటి మెడికల్ అకాడమీకి సొంత భవనాలు కేటాయించాలని, సొంత భవనాలతో పాటు నిధులు కూడా కేటాయించి అభివద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినిలు విద్యార్థినిల తల్లిదండ్రులు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు ఆర్.సాయిరాం, సిఐటియు నాయకులు నరేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు

శీతల పానీయాలు పంపిణీ



ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ ఉపవాస దీక్ష చేయుచున్న వారికి శీతల పానీయాలు పంపిణీ చేశారు. శుక్రవారం మచిలీపట్నంలోని రాజుపేట, రామకష్ణ పబ్లిక్ స్కూల్ ఎదురుగా ఉన్న మసీదులో కొల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ ఉపవాస దీక్ష విరమించిన ప్రతి ఒక్కరికి శీతల పానీయాలు అందించారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాద్, టౌన్ పార్టీ అధ్యక్షుడు ఇలియాస్ పాషా, మాజీ ప్రభుత్వ ఆసుపత్రి డైరెక్టర్ అజీమ్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫైరోజ్, బాజాని, ఆసిఫ్ అలీ, జిలాని, భాష, రఘు ,చంటి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని నిరసన



గుడివాడలో నిరసన తెలుపుతున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు.విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు గనులు కేటాయించాలని కోరుతూ గుడివాడ ఆటోనగర్‌లో శుక్రవారం నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలని, కాంట్రాక్టు కార్మికుల తొలగింపును నిలిపివేయాలని, కేంద్రం ప్రకటించిన 1500 కోట్ల రూపాయలను స్టీల్ ప్లాంట్ అభివద్ధికి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి తమ్మిశెట్టి లక్ష్మణరావు, ది కష్ణ జిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ కుద్దుస్, నాయకులు కల్వకుంట నాగరాజు, ఎస్.కె మొహిద్దీన్ భాష పాల్గొన్నారు.

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : ఆంధ్రుల హక్కు అయినా విశాఖ ఉక్కుని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చేసే విధానాన్ని మానుకోవాలని విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంత గనులు కేటాయించాలని సిఐటియు కష్ణా జిల్లా నాయకులు టి చంద్రపాల్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం సిఐటియు కార్యాలయంలో సిఐటియు, ఏఐటియుసి, ఇతర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో సిఐటియు జిల్లా నాయకులు చంద్రపాల్ మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ కు సొంతగ నులు కేటాయించాలని, ప్రభుత్వం ప్రకటించిన ప్యాకేజీలో ఉద్యోగులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. దేశంలో సముద్రతీరం, జాతీయ రహదారులు ఎయిర్ పోర్ట్ పక్కన ఉన్న ఏకైక స్టీల్ ప్లాంట్ విశాఖ ప్లాంట్ అన్నారు. 20 వేల ఎకరాల భూమి నాణ్యమైన స్టీల్ ఉత్పత్తి విశాఖ స్టీల్ ప్లాంట్ సొత్తు అన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు ఓ ఎల్ రావు, సిఐటియు కష్ణా జిల్లా కోశాధికారి బూర సుబ్రహ్మణ్యం, సిఐటియు మచిలీపట్నం మండల కార్యదర్శి సిహెచ్ జయరావు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఎండి యూనస్, ఎన్ పి ఆర్ డి జిల్లా నాయకులు ఎన్ఎస్ నారాయణ పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

ప్రజా వేదికలో అర్జీల స్వీకరణ

ప్రజాశక్తి - గుడివాడ : సీఎం చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే ముఖ్యమని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం స్థానిక 22వ వార్డులో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆధ్వర్యంలో ప్రజావేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైలు పేటలో ప్రజల నుండి సమస్యల అర్జీలను స్వీకరించారు. ప్రజా సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే పలు సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకున్నారు. అనంతరం రాము మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకునేందుకే వార్డుల వారీగా ప్రజావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. తన దష్టికి వచ్చిన సమస్యల్లో అత్యధిక సమస్యలను తక్షణమే పరిష్కరించామన్నారు. ఆర్థికపరమైన సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకుంటా మన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణాధ్యక్షుడు దింట్యాల రాంబాబు, నాయకులు పండ్రాజు సాంబశివరావు, చేకూరు జగన్మోహనరావు, కొడాలి బాలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



ఉంగుటూరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి-ఉంగుటూరు : శ్రామిక జన చైతన్యమే ఏకైక లక్ష్యంగా జీవితాంతం కృషిచేసిన కారల్ మార్క్స్ అందరికీ ఆదర్శనీయుడని సిపిఎం నాయకులు చిక్కవరపు శ్రీహరి అన్నారు. శుక్రవారం మండలంలోని ఉప్పులూరు గ్రామంలో కారల్ మార్క్స్ 144వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ కార్ల్ మార్క్స్ తన 17వ ఏట నుంచి తుది శ్వాస విడిచే వరకు శ్రామిక జన చైతన్యం కోసం సమాజంలోని మానవాళి ఏకత్వం కోసం కృషి చేసిన వ్యక్తి అని అన్నారు. ఆర్థిక అసమానతలు తొలగించే క్రమంలో విశ్లేషణలు, ప్రణాళికలు రూపొందించి ఆ మార్గంలో నడిచిన కార్ల్ మార్క్స్ అందరికీ ఆదర్శప్రాయుడయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు ఎం చంటిబాబు, వి రమేష్, నాయకులు చిక్కవరపు వెంకటరెడ్డియ్య ,ఉప్పులూరు ఆంజనేయులు, వెంగళ సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - గుడివాడ :కారల్ మార్క్స్ 142వ వర్ధంతి సుందరయ్య భవన్లో సిపిఎం నాయకులు టి. లక్ష్మణరావు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. కారల్ మార్క్స్ చిత్రపటానికి సిపిఎం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి సిపిఎం నాయకులు పి రజిని, ఆర్ కొండ, ఎస్ సుధాకర్, ఎల్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో నివాళులర్పిస్తున్న నాయకులు

ఉత్సాహంగా హోలీ సంబరాలు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం గోర్ భాయ్ సేవా సంఘం ఆధ్వర్యంలో హోలీ పండుగను బంజారా లంబాడి సోదరులందరూ పాల్గొని ఆనంద ఉత్సవాల మధ్య సోదరీ సోదరీమణులు, చిన్నారులు పాల్గొని పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో గోర్భాయ్ సేవా సంఘం అధ్యక్షులు లాహోరీ బంధు నాయక్, ఉపాధ్యక్షులు భూక్య బధ్యానాయక్ గారు మరియు బాణావత్ రాజు నాయక్ గారు భూక్య కృష్ణనాయక్, లాహోరీ మోహన్నార్య గారు ఆడోతు బ్రహ్మంగారు మూడవత్ హరిచంద్ర, డాక్టర్ శ్రీనివాస్ నాయక్, వడ్తీయ శివలల్ డాక్టర్ వెంకటేశ్వరావు, అహోరి బాలమ్మ, ధరవత్ శ్యామల బనవత్ బుజ్జి సంఘం సభ్యులందరూ పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ పట్టణంలో పలు ప్రాంతాలలో ప్రాంతాల్లో హోలీ పండుగ, హోలీ కేరింతలు ఆనందంగా నిర్వహించారు.సహజ రంగులు చల్లుకుంటూ చిన్నారు హుషారుగా గడిపారు. చిన్నారులు రంగులు పూసుకుంటూ డ్యాన్సు డీజే సౌండ్స్ తో హోరెత్తించారు. చిరు వ్యాపారులు, రాజస్థాన్ టీ స్టాల్స్, మార్వాడీలు రంగులు చల్లు కుంటూ ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. చిన్నారులు వీధులలో తిరుగుతూ రంగులు చల్లు కుంటూ హెూలీ వేడుకలు జరుపుకున్నారు.మ్లెహన్, ముఖేష్, రాజ్ సింగ్ పలువురు పాల్గొన్నారు. **వత్సవాయి :** మండలంలో కన్నివేడు, గోపినేనిపాలెం, మక్కపేట, భీమవరం, మంగోల్లు, తదితర గ్రామాల్లో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హోలీ పండుగ సందర్భంగా తండాల్లో మహిళలు పురుషులు హోలీ సందర్భంగా వివిధ రకాల రంగులతో పూసుకున్నారు. రంగు నీళ్లను కొట్టుకున్నారు. ఆలింగనం చేసుకున్నారు. **కంచికచర్ల :** హోలీ పండుగ ప్రజల అందరజీవితాలలో కొత్త వెలుగులు నింపాలని జిల్లా పంచాయతీ రాజ్ చీఫ్ బాలు నాయక్ పేర్కొన్నారు. కంచికచర్ల ఇందిరా కాలనీ సూర్య నాయక్ తండాలో శుక్రవారం హోలీ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పంచాయతీ రాజ్ చీఫ్ బాలు నాయక్ మాట్లాడుతూ దేశసమైక్యతకు హోలీ పండుగ ఒక నిదర్శ నమని, కులమతాలకు అతీతంగా దేశవ్యాప్తంగా ప్రజ లందరూ జరుపుకునే పండుగలో ఈ హోలీ పండుగ ఒకటని ఆయన అన్నారు. వసంత కాలంలో మన ఆరోగ్యం కోసం నిర్వహించుకునే హోలీ పండుగను రసాయ నాలు ఉపయోగించి కలుషితం చేయవద్దని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్ విజ్ఞప్తి చేశారు. అనంతరం సూర్య నాయక్ తండావాసులు పంచాయతీరాజ్ చీఫ్ ఇంజనీర్ బాలు నాయక్‌ను శాలువాలతో ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో సూర్య నాయక్ తండావాసులతో పాటు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మల్లాది శ్రీనివాసరావు పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజనీర్ టివి.రవికుమార్ పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం

పలుచోట్ల హోలీ సంబరాలు చిన్నాపెద్దా తేడా లేకుండా, కులమతాల సంబంధం లేకుండా సంతోషంగా నిర్వహించుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. రంగులు జల్లుకుని ఉత్సాహంగా గడిపారు. చిన్నారులు సైతం మేము తక్కువ కాదంటూ రంగుల్లో మునిగి తేలారు. పెద్దలను సైతం రంగునీళ్లల్లో ముంచెత్తారు.




కంచికచర్ల :



బ్రహ్మోత్సవాల్లో వ్యవసాయ పంటలు ప్రదర్శన

ప్రజాశక్తి - గంపలగూడెం : నెమలి శ్రీ వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా, ఆలయ ప్రాంగణంలో రైతులు సౌకర్యార్థం పంటల ప్రదర్శన నిర్వహించినట్లు గంపలగూడెం మండలం వ్యవసాయ అధికారి బి.సాయి శ్రీ తెలిపారు. ప్రదర్శనలు 240 మంది రైతులు తమ పంటల వివరాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో తిరువూరు ఏడిఏ కెనడి, మండల వ్యాప్తంగా ఉన్న విఏఏలు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

నెమలిస్ శ్రీ వేణుగోపాలస్వామి వారి బ్రహ్మోత్సవాలకు మైలవరం ఎసిపి ప్రసాదరావు పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటైంది. ఒకవైపున భక్తులకు ఆటంకం కలగకుండా మరోవైపున వాహనాల మళ్లింపు, తదితర అంశాలపై 350 మంది సిబ్బందితో ఈ బందోబస్తు ఏర్పాటు కాక 30 మంది సిఐఎస్ఐలు బందోబస్తుల పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గయాజుద్దీన్

యువకుడి కృత్రిమ కాళ్లకు సాయం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక 41వ డివిజన్ దర్గా ప్రాంతానికి చెందిన ఆదిల్ అనే యువకుడికి కృత్రిమ కాళ్ల ఏర్పాటుకై రూ.20 వేలు ఆర్థిక సహాయాన్ని ఐజా గ్రూప్ చైర్మన్ షేక్ గయాసుద్దీన్ (ఐజా) శుక్రవారం సాయంత్రం భవానీపురంలోనీ తన కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా గయాసుద్దీన్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో ఆదిల్ తన ఎడమకాలును కోల్పోయాడని, ఈ విషయాన్ని ఆయన మిత్రబృందం తన దృష్టికి తీసుకువచ్చిందని అన్నారు. ఆదిల్‌కు ఆయన మిత్రబృందం సహాయం చేస్తున్న విషయం తన దృష్టికి రావడంతో తన వంతు సహాయంగా రూ.20 వేలు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐజా గ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

ప్రజాశక్తి - కంచికచర్ల : పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని, గుర్తింపుకార్డు, పిఎఫ్, ఇఎస్ఐ, ప్రమాదబీమా, కల్పించటంతో పాటు టెండర్ల విషయంలో హైకోర్టు తీర్పులు అమలు చేయాలని రిమాండ్ చేస్తూ ఈ నెల 17న విజయవాడలో జరపతలపెట్టిన మహాధర్నాను జయప్రదం చేయాలని యానియన్ జిల్లా కార్యదర్శి సిహెచ్.సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పరిటాల, కంచికచర్ల గ్రామ పంచాయితీ కార్మికులతో కలిసి డిమాండ్లతో కూడిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం 132,142, 680 జీఓలను అమలుచేయాలని డిమాండ్ చేశారు.అనంతరం ఆయా గ్రామ పంచాయితీ సిబాబందికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం సౌమేశ్వరరావు, మండల కార్యదర్శి బేజాడం భూషణం తదితరులు పాల్గొన్నారు.



నేడు విద్యుత్ అదాలత్

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ ఆపరేషన్ డివిజన్, విజయవాడ రూరల్ ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్ అవగాహన సదస్సు శనివారం నిర్వహించనున్నట్లు విజయవాడ రూరల్ డివిజన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇబ్రహీంపట్నంలోని ముత్తవరపు కళ్యాణ మండపంలో జరిగే ఈ కార్యక్రమం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 నిల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిజిఆర్ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేలు, ఫోరం సభ్యులు ఎస్ఇ, విజయవాడ, విద్యుత్ అధికారులు పాల్గొన్నారు. డివిజన్‌లోని విద్యుత్ వినియోగదారులు తమ ఫిర్యాదులను రాత పూర్వకంగా సర్వీస్ కనెక్షన్ నెంబర్, పూర్తి అడ్రస్, సెల్ నెంబర్‌తో ఆర్‌జిజి సమస్య పరిష్కరించుకోవాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలు. హెచ్చుతగ్గులు, మీటర్ సమస్యలు, బిల్లుల సమస్యలు విద్యుత్తు సరఫరాకు సంబంధించిన ఇతర అన్ని సమస్యలు పరిష్కరిస్తారని తెలియజేశారు. విద్యుత్ వినియోగదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.వసంతరావు కోరారు.

చీఫ్ ఇంజినీర్‌కు ఉద్యోగ సంఘాల అభినందనలు

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : డాక్టర్ ఎన్‌టిటిపిఎస్ చీఫ్ ఇంజనీర్ టి.నాగరాజు సంవత్సర కాలం పూర్తి చేసుకున్న సందర్భంగా ఉద్యోగులు, ఉద్యోగ కార్మిక సంఘాల నాయకులు అభినందనలు తెలిపారు. డాక్టర్.ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజనీర్ కార్యాలయంలో నాగరాజును కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్చాలు అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎపిఎస్ఇబి ఎస్‌సి, అండ్ ఎస్‌టి ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.సత్య ప్రసాద్, బి.పాపారావు మాట్లాడుతూ, డాక్టర్.ఎన్టీటీపీఎస్ చరిత్రలో ఎన్నో రికార్డుల మీద రికార్డులు సృష్టిస్తూ ముందుకు సాగుతున్న నేపథ్యంలో శుభాకాంక్షలు తెలియజేశారు. ఏపీఎస్ఈబి ఇంజనీర్స్ అసోసియేషన్ బ్రాంచ్ ప్రెసిడెంట్, కేవీఎన్ చక్రపాణి మాట్లాడారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఈబి ఎస్సీ అండ్ ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు టి.సత్య ప్రసాద్, బి.పాపారావు కొత్తపల్లి వెంకటరమణ, కుమార్ స్వామి, బ్రాంచ్ ప్రెసిడెంట్, కేవీఎన్ చక్రపాణి, కోశాధికారి యు.వెంకట్రావు కార్యవర్గ సభ్యులు మురళీకష్ణ, గోపాలకృష్ణ, భారత మజ్దూర్ సంఘ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



తిరుమలగిరి గుడికి పంచలోహ సుదర్శన చక్రం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి శ్రీ స్వామివారి అలంకరణ నిమిత్తం మండలంలోని పోచంపల్లి గ్రామానికి చెందిన మహంకాళి నరసింహారావు, లీలావతి దంపతులు శ్రీ స్వామివారికి 18 కేజీల పంచలోహపు సుదర్శన చక్రాన్ని ఆలయ అర్చకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండల చైర్మన్, అర్చకులు రామకృష్ణమాచార్యులు పాల్గొన్నారని ఆలయ సహాయ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం సర్వారం గ్రామానికి చెందిన మైలా నాగేశ్వరరావు, శిరీష దంపతులు రూ.25,116లు విరాళంగా అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ అర్చకులు తిరునగరి రామకృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి సిబ్బంది శ్రీ స్వామివారి ప్రసాదం అందజేసినట్లు ఆలయ సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి, ధర్మకర్తల మండల చైర్మన్ తెలిపారు.



బాదంతో చక్కని ఆరోగ్యం

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : మనం తినే ఆహారంలో రెగ్యులర్ గా బాదం తీసుకోవడం వలన చక్కటి ఆరోగ్యం ఉంటుందని ప్రముఖ హెల్త్ కేర్ నిపుణులు రితిక అన్నారు: నగరంలోని ఓ హెూటల్ నందు, పోషకాహారం అనే అంశంపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమతుల్యతను సాధించడానికి ఒక సులభమైన మార్గంగా కాలిఫోర్నియా బాదంను వినియోగించుకోవచ్చని అన్నారు. అత్యంత ప్రజాదరణ పొందిన కాలిఫోర్నియా బాదం సహజంగా ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఫైబర్‌తో సహా 15 ముఖ్యమైన పోషకాలతో నిండి ఉంటుంది, అన్నారు. ఇవి సాంప్రదాయ వంటకాలకు ఆరోగ్యకరమైన జోడింపుగా ఉంటాయి అని,. బాదం పప్పును తండైలో కలిపినా, స్వీట్ల మీద చల్లినా, లేదా కాల్చిన స్నాక్‌గా తిన్నా, రుచి, ఆకతి రెండింటినీ పెంచుతాయి అని తెలిపారు.

రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ముస్లిం మహిళలకు జిల్లా ప్రభుత్వ ఖాజీ హబీబుల్లా హుస్సేన్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కొండపల్లిలోని ఖాజీ మసీదు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రంజాన్ పండగ జరుపుకునేందుకు అవసరమైన నిత్యావసర సరుకులతో కూడిన తోఫా మహిళలకు అందజేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ రంజాన్ మాసంలో ప్రతి ఒక్క సాటి మనిషికి తమ వంతు సహాయం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఖాజీ కుటుంబ సభ్యులు, స్థానిక ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.



సిపిఎం బృందాలకు సమస్యలు ఏకరువు

- శ్మశానాల పక్కన స్థలాలిచ్చారని లబ్ధిదారుల ఆవేదన
- సమస్యలు పరిష్కరించాలని చల్లపల్లిలో సర్పంచ్‌కు వినతిపత్రం



ఉయ్యూరులో వై.నరసిమహారావుకు సమస్యలు తెలుపుతున్న స్థానికులు

ప్రజాచైతన్య యాత్రలో భాగంగా కృష్ణా జిల్లాలో పలు ప్రాంతాల్లో సిపిఎం నాయకులు పర్యటిం చారు. మొవ్వ మండలంలో పలువురు మహిళలు మాట్లాడుతూ శ్మశానాల పక్కన ఇళ్లపట్టాలి చ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ఉయ్యూరు మండలం లో సిపిఎం జిల్లా కార్యదర్శి వై. నరసింహారావు పర్యటించి సమస్యలు అడిగి తెలుసు కున్నారు. అలాగే చల్లపల్లిలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో పలువురు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సర్పంచ్, కార్యదర్శికి అందించారు.

ప్రజాశక్తి-చల్లపల్లి(మొవ్వ) : ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సిపిఎం మొవ్వ మండల బృందం శుక్రవారం చినముత్తేవి గ్రామంలోపర్యటించి ప్రజలను కలుసుకొని సమస్యలను అడిగి తెలుసు కున్నారు. ఈ సందర్భంగా పలువరు ఇళ్ల స్థలాల సమస్య వివరించారు. 2018 సంవత్సరంలో నాటి ప్రభుత్వం గ్రామంలో పేదలను గుర్తించి రెండు సెంట్లు చొప్పున 45 మందికి పట్టాలు పంపిణీ చేసిందని, అలాగే 2020లో మరొకసారి గ్రామంలో పేదలను గుర్తించి సెంటున్నర చొప్పున మరో 80 మందికి ఇంటి పట్టాలను అందించారన్నారు. మొత్తం గ్రామంలో 125 మందికి పట్టాలు ఇచ్చారని, కానీ ఇచ్చిన స్థలం శ్మశానాల పక్కన, పూర్తి గొయ్యలో ఇవ్వటంతో లబ్ధిదా రులు ఆ స్థలాల్లోకి వెళ్ళటానికి సుముఖత చూపలేదన్నారు. ఇప్పటికైనా ప్రస్తుత ప్రభుత్వం గతంలో ఇచ్చిన శ్మశానం దగ్గరలో భూమిని రద్దుచేసి మరొక చోట ఇవ్వాలని కోరారు. అలాగే చినముత్తేవి గ్రామంలో ఐనంపూడి డ్రైన్ పై శిథిలమై ఉన్న వంతెనను వెంటనే నిర్మించి, నిడుమోలు నుండి మొవ్వ వరకు ఆర్టీసీ బస్సు నడపాలని మహిళలు కోరారు. గ్రామంలో డ్రైనేజీ సౌకర్యం లేదని వర్షం వస్తే వర్షపు నీరు నిలబండటం వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, పార్టీ సభ్యులు చిగురుపల్లి సుబ్రమణ్యం, దేవరపల్లి మణి, గ్రామస్తులు తూములూరి రమణ ,వీరయ్య, వీరంకి స్వామి, శివ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : ట్రూ ఆఫ్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులను దోపిడి చేస్తుందని, ప్రజలకు తెలియ కుండానే స్మార్ట్ మీటర్ల పేరుతో చిరు వ్యాపారులపై ఆర్థిక సమస్యల పెనుబారాలు మోపుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం ఉయ్యూరు 12వ వార్డులో ఆయన గడపగడపకు తిరిగిసమస్యలు తెలుసుకున్నారు. పుల్లేరు కట్టపై నివాసముంటున్న విద్యుత్ వినియోగ దారుల సమస్యలను తెలుసుకున్నారు. టిడ్కో గృహ సముదా యాల గురించి అనేకమంది లబ్ధిదారులు ఎన్నిసార్లు ప్రభుత్వానికి విన్నవిం చుకున్న స్పందన కరువైందని లబ్ధిదారుల వాపోయారని ఆయన తెలిపారు.కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ అంటూ ప్రజలను మోసం చేసిందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బి. రాజేష్, పడాల లక్ష్మణరావు, ఎన్ గోపాల్, ప్రేమ్, సాయి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నారాయణరావు నగర్ కాలనీ నుండి పంచాయతీ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని గ్రామ సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, కార్యదర్శి పివి మాధవేంద్రరావుకు అందజేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి యద్దనపూడి మధు మాట్లాడుతూ చల్లపల్లి పంచాయతీ పరిధిలోని నారాయణ రావు నగర్ గురుకుల పాఠశాల సమీపంలో, జగనన్న కాలనీలో సమస్యలను పరిష్కరించాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలల సమీపంలో తొమ్మిది అంతర్గత రోడ్లు అభివద్ధి చేయాలని, మంచినీటి సౌకర్యం కల్పించాలని, అదే ప్రాంతంలోని కమ్యూనిటీ స్థలంలో ఉన్న జంగిల్ క్లియరెన్స్ చేసి కమ్యూనిటీ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. జగనన్న కాలనీలో గల లేఔట్లలో ఎల్ 1 నుండి 4 వరకు అన్ని రోడ్లు నిర్మాణం చేపట్టాలని, తాగునీటి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. తొలుతగా నారాయణరావు నగర్ కాలనీ నుండి పంచాయతీ కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. అనంతరం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పంచాయతీ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు వాకా రామచంద్రరావు, మండల కమిటీ సభ్యులు బల్ల వెంకటేశ్వరరావు, మహమ్మద్ కరీముల్లా, నాయకులు నంద్యాల ప్రభు, వెనిగళ్ళ వసంతరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : గుడివాడ న్యూ ఇందిరా నగర్ కాలనీలో ప్రధాన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం మండల కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఎంతలపెట్టిన ప్రజాసమస్యలపై ప్రచార యాత్రలో భాగంగా ఆయన ఇందిరా నగర్ కాలనీలో పార్టీ కార్యకర్తలతో కలిసి శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ న్యూ ఇందిరానగర్ కాలనీలో ప్రధాన రహదారి గోతులు పడి అధ్వాన్నంగా తయారైందని, దీంతో ప్రజల రాక పోకలకు తీవ్ర అసౌకర్యంగా వుందన్నారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డు వేయించటంతో పాటు డ్రైనేజీ, తాగునీటి సౌక ర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో సిపిఎం నేతలు రజని, కొండా, సురేంద్ర, స్థానికులు బాషా, రవి పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి** : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా బంటుమిల్లి మండలంలోని జానకిరాంపురం గ్రామంలో సిపిఎం బృందం పర్యటించి స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకుంది. సిపిఎం బందానికి గ్రామస్తులు మంచినీటి, ఇళ్ల స్థలాల సమస్య తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పాల్గొన్నారు.



మొవ్వలో నివేశన స్థలాల పట్టాలు చూస్తున్న స్థానికులు



చల్లపల్లిలో...



బంటుమిల్లిలో..



గుడివాడలో...

4 నుంచి పాలిసెట్‌కు ఉచిత శిక్షణ



ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక ఏఏఎన్ఎంఅండ్ వి వి ఆర్ ఎస్ ఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ నాల్గవ తేదీ నుండి 30 వరకు ఉచిత పాలిసెట్ కోచింగ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రాజశేఖర్ తెలిపారు. కోచింగ్ తీసుకోదలచిన విద్యార్థులు ఏప్రిల్ మూడో తేదీ లోపు కలర్ పాస్పోర్ట్ సైజ్ ఫోటో, ఎస్ ఎస్ సి హాల్ టికెట్ జిరాక్స్ తో కాలేజీకి వచ్చి పేరు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు ఎం శివ ప్రసాద్ లెక్చరర్ ఇన్ ఇంగ్లీష్, ఎన్ రాజశేఖర్ ప్రిన్సిపల్ సెల్ నెంబర్ 79975 089 31 సంప్రదించాలన్నారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల30 నిమిషాల నుండి తరగతుల నిర్వహణ, పాలిసెట్ కోచింగ్ లో సుదీర్ఘమైన అనుభవం కలిగిన అధ్యాపకులచే శిక్షణ, ప్రతి స్టూడెంట్ పై ప్రత్యేక శ్రద్ధ, ప్రతిరోజు షెడ్యూల్ ప్రకారం క్లాసులు నిర్వహణ, గ్రాండ్ టెస్టుల నిర్వహణ, విశాలమైన మరియు ఆహ్లాదకరమైన కార్యకర్తల గదుల్లో బోధన నిర్వహిస్తామని తెలిపారు.

వైసిపి అవనిగడ్డ మండల అధ్యక్షుడిగా శ్రీనివాసరావు ఎన్నిక



ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా తిరిగి రేపల్లె శ్రీనివాసరావును నియ మిస్తూ జిల్లా అధ్యక్షుడు పేర్ని వెంకటరామయ్య(నాని) ఉత్తర్వులు జారీ చేశారు. రేపల్లి శ్రీనివాసరావు గత 12 సంవత్సరాలుగా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. తిరిగి తనను మండల పార్టీ అధ్యక్షుడిగా నియమించడం పట్ల పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి, జిల్లా పార్టీ అధ్యక్షులు పేర్ని వెంకటరామయ్యకు, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబుకు శ్రీనివాసరావు కతజ్ఞతలు తెలిపారు. తనకు పార్టీ అప్పగించిన బాధ్యతను నిబద్ధతతో పనిచేసే పార్టీ పటిష్టతకు కషి చేస్తానన్నారు.

ఉపాధి కార్మికులకు రోజుకు రూ.700 ఇవ్వాలి

ప్రజాశక్తి- గన్నవరం : ఉపాధి హామీకి పాలకులు తూట్లు పొడుస్తున్నారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ కోటేశ్వరరావు రాష్ట ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం గన్నవరం మండలంలోని బుద్ధవారం, దావజీగూడెం, అల్లాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిహెచ్ కోటేశ్వరావు మాట్లాడుతూ నేడు పాలకులు ఉపాధి హామీని చిత్తశుద్ధితో అమలు చేయడం లేదని ఆ పథకాన్ని నీరు కార్చేందుకు కుటిల ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. ఉపాధి హామీ పనులు చేస్తున్న పనివారికి పనిముట్లు మంచినీళ్లు, మజ్జిగ ఫస్ట్ ఎయిడ్ బాక్సు సరఫరా చేయాలని కోరారు. ఉపాధి హాని పని కూలీలకు రోజుకు 700 రూపాయలు చొప్పున ఇవ్వాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు కొండ విరాస్వామి,టి సుబ్బారావు గోపి, రంగమ్మ పాపమ్మ నాగేశ్వరవు,మరియమ్మ వెంకటేశ్వరవు, నాచుపతి తదితరులు పాల్గొన్నారు..

టెన్త్ విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం

ప్రజాశక్తి-అవనిగడ్డ : సోమవారం నుండి ప్రారంభమయ్యే 10వ తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు ఏపీఎస్ఆర్టీసీ డిపో మేనేజర్ కే హనుమంతరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థులు తమ నివాస ప్రదేశం నుంచి పరీక్షా కేంద్రమునకు వెళ్లేందుకు, పరీక్ష రాసి తిరిగి వచ్చేందుకు హాల్ టికెట్ చూపించిన ఉచితంగా ప్రయాణించవచ్చునన్నారు. అందువల్ల అవనిగడ్డ డిపో పరిధిలోని విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని డిపో మేనేజర్ కోరారు.

మినుము రైతులను ఆదుకోవాలి : రైతుసంఘం

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండల పరిధిలోని మల్లపర్రు గ్రామంలో రైతు సంఘం ఆధ్వర్యంలో నాయకులు మినప పంటను శుక్రవారం పరిశీలించారు. గిట్టుబాటు ధర లేక ఆందోళన చెందుతున్న రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మినుములను క్వింటాకు 9000 రూపాయలు చొప్పున కొనుగోలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. అలాగే రైతుల వద్ద నుంచి ధాన్యం కూడా కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరావు, బంటుమిల్లి మండల రైతు సంఘం నాయకులు అజయ్ ఘోష్, రైతులు పాల్గొన్నారు.



మినుము పంట పరిశీలిస్తున్న దృశ్యం

చెరుకు రైతులకు బ్యాంకు రుణాలివ్వాలి

- కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు

ప్రజాశక్తి-కంకిపాడు : ఉయ్యూరు పరిసర ప్రాంతాల్లో చెరకు సాగు చేస్తున్న కౌలు రైతులకు , రైతులకు పంట రుణాలు ఇవ్వాలని కౌలు రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం. హరిబాబు డిమాండ్ చేశారు. పునాదిపాడు, కంకిపాడు పొద్దుటూరు తదితర ప్రాంతాల్లో చెరకు సాగు చేస్తున్న కౌలు రైతులను హరిబాబు కలిసి మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో చెరుకు సాగు చేస్తున్న వారికి పంట రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. వాస్తవంగా బ్యాంకులు వ్యవసాయ రంగాన్ని ప్రాధాన్యతా రంగంగా గుర్తించి పంట పంటలు సాగు చేసే సాగుదారులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం రుణాలు ఇవాల్సి ఉందనీ, కానీ రకరకాల కారణాలు చెప్పి చెరుకు రైతులకు రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు నిరాకరిస్తున్నాయని, ఇది ఏమాత్రం తగదన్నారు. ఒకవైపు ప్రభుత్వం బ్యాంక్ అధికారులు వ్యవసాయం సాగు చేస్తున్న వారికి ఇతోదికంగా రుణాలు ఇస్తున్నాయని పెద్ద ఎత్తున చెబుతున్నప్పటికీ వాస్తవంలో చెరకు సాగు చేస్తున్న కౌలు రైతులకు పంట రుణాలు అందడం లేదని, ఫలితంగా చెరకు సాగు విస్తీర్ణం తగ్గిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బ్యాంకులు చెరుకు సాగు చేస్తున్న రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కే ప్రభాకర్ రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి ఎస్ అనిల్ కుమార్



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎం.హరిబాబు, తదితరులు

పిరమిడ్ మందిరం వార్షికోత్సవం

ప్రజాశక్తి - నందిగామ : నందిగామ కాకులయ్య వీధిలో పిరమిడ్ మందిరం రెండో వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. నందిగామ మండలం పిరమిడ్ స్పిర్చువల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామ పట్టణంలో అహింస పరమ ధర్మ, శాఖాహారం అమృతహారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అని పిరమిడ్ వ్యవస్థాపకుడు పత్రీజ సందేశమైనఆరోగ్యమే ధ్యానం అంటే శ్వాస మీద ధ్యాస చేయటం వల్ల పరిపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని అవగాహన ర్యాలీలో తెలిపారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు పాల్గొన్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న రాంప్రదీప్

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - తిరువూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బేటి పడా వో బేటి బచావో కార్యక్రమం గ్రామ నోడల్ టీచర్ ఎం.రాంప్రదీప్ అన్నారు. శుక్రవారం మండలంలోని గానుగపాడులో బాలిక విద్యపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల లోపు ఆడపిల్లలకు పెళ్లి చేయడం నేరమన్నారు. చిన్న వయసులో పెళ్లి చేయడం వల్ల అమ్మాయిలకు కలిగే నష్టాలను, కుటుంబ వ్యవస్థలో ఎదుర్కొనే సమస్యలను కూలంకుషంగా వివరించారు. బాలికల వికాసానికి ప్రభుత్వాలు పలు పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ఆడపిల్లలు చదువుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు.

120 మైక్రాన్స్ ప్లాస్టిక్ మాత్రమే ఉపయోగించాలి

నందిగామ మున్సిపల్ కమిషనర్ రమణ బాబు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ పట్టణంలో 120 మైక్రాన్స్ గల ప్లాస్టిక్ వాడకం మాత్రమే ఉపయోగించాలని నందిగామ మున్సిపల్ కమిషనర్ ఇవి రమణబాబు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విలేకరుల తో మాట్లాడుతూ వర్తక వ్యాపారస్తులుకు మార్చి 15న బాబు జగజీవన్ హాల్లో అవగాహన సదస్సు జరుగుతుందని పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్లో భాగంగా ఆదేశాలు జారీ చేశారు. నందిగామ పట్టణంలో వర్తక వ్యాపారాలతో మార్చి 15వ తారీకు ఉదయం 11 గంటలకు పాత బస్టాండ్



బాబు జగజీవన్ రామ్ భవన్‌లో 120 మైక్రాన్స్ గల ప్లాస్టిక్ వాడకం మాత్రమే వినియోగించు అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు పట్టణంలో హోటల్ యజమానులు, టిఫిన్ సెంటర్లు, కర్రీ పాయింట్స్ టీ స్టాల్స్, కూరగాయల వ్యాపారస్తులు, వర్తక వ్యాపారస్తులందరూ తప్పకుండా హాజరు కావాల్సిందిగా కోరారు.

నియామకం

ప్రజాశక్తి విస్సన్నపేట : వైసిపి జిల్లా కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. స్థానిక వైసిపి నాయకులైన పల్లెపాం లక్ష్మయ్య కార్యదర్శిగా, ముంగా జయరాజు ప్రతినిధిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య, జయరాజు పార్టీ అధిష్టానానికి మండల నాయకులుకు శుక్రవారం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వైసిపి మండల నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

మద్దతు ధరకే మొక్కజొన్న కొనుగోలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి ధనలక్ష్మి

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని కొత్తగూడెం, మంగాపురం, గ్రామాల్లో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు వి.ధనలక్ష్మి, రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి శుక్రవారం పర్యటించి మొక్కజొన్న రైతుల నుంచి వివరాలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొక్కజొన్నకు మద్దతు ధర రూ.2,280 ప్రకటించిందని, కానీ గ్రామాల్లోని ప్రయివేటు వ్యాపారస్తులు కొన్ని గ్రూపులుగా ఏర్పడి మార్కెట్ వరకు రాకుండా దళారులు కొనుగోలు చేస్తున్నారని అన్నారు. ప్రారంభంలోనే ధరను తగ్గిస్తే పంట మొత్తం చేతికి వచ్చిన తర్వాత రేటు పూర్తిగా దిగజారిపోయే పరిస్థితి ఉందని రైతులు తీవ్రంగా నష్టపోతారని అన్నారు. ఇప్పటికీ కొత్త కొత్త రకాల సీడ్స్ వచ్చి దిగుమతులు రాక పెట్టిన పెట్టుబడులు రాక రైతులు ఇబ్బందుల్లో ఉన్నారని ఇటువంటి తరుణంలో ప్రభుత్వం ఎఎంసి ద్వారా కొనుగోలు చేయవలసిన అవసరం ఉందని కానీ వ్యవసాయ శాఖ అధికారులు సరైన రీతిలో స్పందించకపోవడం మూలంగా ప్రవేటు వ్యాపారస్తులు



కొత్తగూడెం గ్రామంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

అడ్డగోలుగా కొనుగోలు చేస్తున్నారని వారు వాపోయారు. తక్షణమే వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి మొక్కజొన్నకు గిట్టుబాటు ధర దక్కేలా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు వజ్రాల శ్రీనివాసరెడ్డి, వి.కృష్ణారెడ్డి, వినాగిరెడ్డి, కె.నరసింహారావు, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళాభివృద్ధితోనే పేదరిక నిర్మూలన సాధ్యం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా వారి కాళ్ల మీద వారు నిలబడినప్పుడే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని అన్నిరంగాల్లో మహిళలు సాధికారిత సాధించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని మండల పంచాయతీ ఛాంపియన్స్ అన్నారు. మండలంలోని తిరుమలగిరి గ్రామంలో శుక్రవారం పంచాయతీ ఛాంపియన్స్ డ్వాక్రా మహిళలతో, గ్రామ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సమైక్య అధ్యక్షురాలు గద్దె రాజ్యలక్ష్మీ మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో డ్వాక్రా మహిళలను ఏడాదిలో ఒక లక్ష 75 వేల మందిని ఎంటర్ ప్రెన్యూర్‌గా తయారు చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి గ్రామపార్టీ సీనియర్ నాయకులు దర్శి నరసింహారావు, పసుపులేటి శ్రీనివాసరావు, బుక్ కీపర్ గుడారు నాగార్జున, పంచాయతీ ఛాంపియన్స్



మాట్లాడుతున్న సమైక్య అధ్యక్షురాలు గద్దె రాజ్యలక్ష్మీ

బి.సతీష్ నాయక్, షేక్ నాగుల్, డ్వాక్రా మహిళలు, గ్రామస్తులున్నారు.

చెవిటికల్లులో పొలంబడి కార్యక్రమం

ప్రజాశక్తి - కంచికచర్ల : కంచికచర్ల మండలంలో చెవిటికల్లులో గురువారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందిగామ సబ్ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు డాక్టర్ ఐకె.శ్రీనివాస పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా రైతులకు సిఫార్సు మేరకు రసాయనిక ఎరువులను వినియోగించాలని, సమగ్ర కలుపు యాజమాన్యం, నీటి యాజమాన్యం చేపట్టడంతో పాటు, ఎలుకల నివారణ గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో, మండల వ్యవసా య ఆధికారి కె.విజయ్ కుమార్ గ్రామ వ్యవసాయ సహాయకులు దుర్గ ప్రసాద్, హనేష్, రఘు, సాయితేజ పాల్గొన్నారు.



చెవిటికల్లులో పొలంబడి కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు

యథేచ్ఛగా అక్రమ మద్యం వ్యాపారం

ఒక్కో గ్రామంలో నాలుగు వరకూ బెల్టు షాపులు

ప్రజాశక్తి - వీరులపాడు : ఎంఆర్‌పి ధరపై రూ.20 ల వరకు అదనంగా వసూలు చేస్తూ మద్యం షాపుల నిర్వాహకుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది. పచ్చని పల్లెల్లో రాత్రి, పగలు తేడా లేకుండా ఎనీ టైం మందు విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. జుజ్జూరు గ్రామ శివారు ప్రాంతంలో లైసెన్స్ కలిగిన మద్యం షాప్ పక్కనే మద్యపాన ప్రియుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు వాటర్ బాటిల్ రూ.30లు అమ్ముతూ అందిన కాడికి దోచుకుంటున్నారు.

వీరులపాడు మండల పరిధిలో ఎక్సైజ్ శాఖ ఆదేశాల ప్రకారం మూడు మద్యం షాపులకు అధికారికంగా అనుమతులు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరయ్యాయి. మండలంలో 22 గ్రామ పంచాయతీలున్నాయి. మొత్తం జనాభా 50 వేలకు పైగా ఉన్నారు. మద్యం షాపులు నిర్వాహకులు ఒక షాపును వెల్లంకి గ్రామంలో రెండో షాపు అల్లూరు గ్రామ శివారులో ఏర్పాటు చేసుకున్నారు. మూడో షాపు జుజ్జూరు గ్రామ శివారు తోటమూల వద్ద ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో రెండు నుంచి ఐదు బెల్ట్‌షాపులు ఏర్పాటు చేసుకునేందుకు షాపుల నిర్వాహకులు ఆదేశాలివ్వడంతో ప్రతి కాలనీలో బెల్ట్ షాపులు ఏర్పాటు చేశారు. దీంతో షాపుల నిర్వాహకులు బెల్ట్ షాపులు నిర్వహించుకునే వారి వద్ద నుండి క్వార్టర్ బాటిల్‌కు ఎమ్మార్పీపై రూ.20ల వరకు అక్రమంగా వసూలు చేస్తూ షాపు నిర్వాహకులు లక్షలు సంపాదిస్తున్నారు. ప్రతి గ్రామంలో తాగునీరు ప్రజలకు అందుతుందంటే నమ్మకం లేదు గానీ మద్యం ప్రియులకు మాత్రం ఎనీ టైం మద్యం దొరుకుతుంది. దీంతో ఆయా గ్రామాల మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ ఎక్సైజ్ శాఖ గ్రామాల్లో ఏం జరుగుతుందో తెలియనట్లుగా ఉదాసీనతగా వ్యవహరించడం పట్ల మండల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకున్న జడ్జి రమణా రెడ్డి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానానికి విజయవాడ సబ్-కోర్టు జడ్జి రమణా రెడ్డి సతీసమేతంగా శ్రీ స్వామి దర్శనార్థం విచ్చేశారు. వారికి దేవస్థాన అర్చకులచే పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీస్వామి శేష వస్త్రం, ప్రసాదం అందజేసినట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు.

హాల్ టికెట్లు అందజేత

ప్రజాశక్తి - వత్సవాయి : పోలంపల్లి గ్రామంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్లో టెన్త్ క్లాస్ విద్యార్థులకు హాల్ టికెట్స్ సోషల్ వర్కర్ దారెల్లి చిరంజీవి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. మండలంలోని పోలంపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు హాల్ టికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని లక్ష్యం వైపు పరిగెత్తాలని అన్నారు.

అన్నదాన ఆశ్రమాన్ని కూల్చటం హేయం

ప్రజాశక్తి - మైలవరం : కడప జిల్లా బద్వేలులో పేదలకు అన్నదానం చేస్తున్న ఆశ్రమాన్ని కూల్చటం హేయమైన చర్యని ఎపి రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు బిక్క నరసింహారెడ్డి, రెడ్డి సంఘం ప్రధాన కార్యదర్శి గజ్జల వెంకటరెడ్డి, సహాయ కార్యదర్శి అన్నం సుబ్బారెడ్డిలు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అటవీ ప్రాంతం అనే కారణంతో నిత్య అన్నదాన ఆశ్రమాన్ని కూల్చివేయటం ఒక సామాజిక వర్గం నేపథ్యంలో జరిగిందని విమర్శించారు. అన్నదాన ఆశ్రమాన్ని కూల్చివేయటం ఖండిస్తున్నామన్నారు. కాశిరెడ్డి నాయన ఆశ్రమాన్ని కాపాడుకుందాం – నిత్యాన్నదానాన్ని కొనసాగిద్దాం అనే నినాదంతో ఈనెల 16న క్షేత్ర సందర్శన కార్యక్రమం చేపట్టామని వేలాదిగా తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పాస్టర్ ఫెలోషిప్ మండల అధ్యక్షులుగా మంద స్వామి

ప్రజాశక్తి - నందిగామ : వీరులపాడు మండల పాస్టర్స్ ఫెలోషిప్ పెద్దాపురం గ్రామంలో నండ్రు శామ్యూల్ చర్చిలో మండల నూతన కార్యవర్గ ఎన్నిక నిర్వహించారు. దైవజనులు మంద స్వామి దాసు అధ్యక్షులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా పత్తిపాటి ఆశీర్వాదం, ట్రెజరర్ ఏసుదాసు ఎన్నుకున్నారు. దైవజనులు భాగ్యరావు దైవ సందేశ్ అందించి సేవకులను బలపరిచారు. అనంతరం దేశ క్షేమం రాష్ట్ర క్షేమం కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు అందరూ కూడా ఐకమత్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. పాస్టర్స్ అందరికీ గౌరవ వేతనం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అడ్వైజర్ కమిటీలు హిజ్కియా రాజు, అబ్రహం, భాగ్యరావు, సురేష్ బాబును ఎన్నుకున్నారు. వైస్ ప్రెసిడెంట్ సామ్యేలు, జయరాజు జాయింట్ సెక్రటరీ, ఇజ్రాయిల్, కిషోర్ జాయింట్ ట్రజరర్, సుబ్బరావు, చంటి, రాజేంద్ర నియమించబడ్డారు. ఈ కార్యక్రమంలో అనిల్ కుమార్, బిఎస్ పౌలు, సీయోను కుమార్, సంసోను తదితర మండల సేవకుల పాల్గొన్నారు.

ఆక్రమణల్లో దావాజీగూడెం మెయిన్ రోడ్డు

- ఆక్రమణల కారణంగా వాహనాలు వెళ్లలేని స్థితి
- ఖాళీ స్థలాల్లో ఆక్రమణదారుల పాగా
- స్థలాలను రోజూవారీ అద్దెకు ఇస్తూ ఆదాయం
- ప్రజల ఇబ్బందులు పట్టించుకోని అధికారులు

సెయింట్ జాన్స్ గేటు పక్కన రోడ్డు ఆక్రమణలు



ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం-దావాజీగూడెం మెయిన్ రోడ్డు వ్యాపారుల ముసుగు వేసుకున్న కబ్జాదారుల చెరలో ఉంది. వెంకటేశ్వర థియేటర్ సెంటర్ నుంచి సెయింట్ జోన్స్ స్కూలు, పామర్తి నగర్ వరకూ రోడ్డును వ్యాపారుల ముసుగులో ఉన్న కబ్జా దారులు సొంతం చేసుకున్నారు.కొందరు రోడ్డు ఆక్రమణలకు తెగబడటమే కాకుండా స్థలాలను మార్కింగ్ చేసి పేదలకు వ్యాపారాలు చేసుకోవడానికి అద్దెలకు ఇస్తున్నారు. కనీసం, బస్సులు, ద్విచక్ర వాహనాలు వెళ్లడానికి కూడా వీలులేకుండా రోడ్డు కబ్బాలకు గురైంది. కబ్జాదారుల ఆగడాలకు భయపడి స్థానిక వ్యాపారులు వలస పోయే పరిస్థితి దాపురించింది. స్థానిక వ్యాపారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

అధికారంతో పాటు ఆక్రమణదారులూ మారుతున్నారు

ప్రజా ప్రతినిధులు మారిన ప్రతిసారీ ఇక్కడ ఆక్రమణదారులు మారిపోతూ ఉంటారు. కొత్తగా వచ్చిన ప్రజాప్రతి నిధుల పేరు చెప్పుకుని కొత్త వాళ్ళు రోడ్డు మార్జిన్ ఆక్రమించి దుకాణాలు పెట్టేస్తున్నారు. ఖాళీ స్థలాల్లో పాగాలు వేయిస్తున్నారు. ఆక్రమణదారులు చిరు వ్యాపారుల ముసుగులు వేయిస్తున్నారు. పోలీసులు, పంచాయతీ అధికారులు అటువైపు చూడటం లేదు. పోనీ ఆక్రమించిన వాళ్ళు వీధి వ్యాపారాలు చేస్తారా అంటే అదీ ఉండదు. హాకర్లను ఎంపిక చేసుకుని రోజువారీ అద్దెకు స్థలాన్ని లీజుకు ఇస్తున్నారు. వైసీపీ అధికారంలో ఉన్నన్నాళ్లు మాజీ ప్రజాప్రతినిధి అనుచరుల కనుసన్నల్లో ఈ రోడ్డు వీధి వ్యాపారాలు సాగాయి. కూటమి అధికారంలోకి రావడంతో ప్రస్తుత కొత్తవాళ్లు రోడ్డు మధ్యలో ఆక్రమించి వ్యాపారాలు పెట్టేస్తున్నారు. పక్కా కోట్లు కట్టేస్తున్నారు. నిజం చెప్పాలంటే వారి చూపు రోడ్డు మీద పడింది. సెయింట్ జోన్స్ స్కూల్ మెయిన్ గేటు వద్ద నుంచి పామర్తి నగర్ వరకు మురుగు కాలవను పూడ్చేసి కొట్లు పెట్టేస్తున్నారు. వెంకటేశ్వర థియేటర్ సెంటర్ వద్ద రోడ్డుకు రెండు వైపులా రోడ్డును ఆక్రమించి హాకర్లకు అద్దెలకు ఇచ్చుకుని సంపాదించు కోవాలని ప్రయత్నాలు మొదలెట్టారు. దీని ఫలి తంగానే ఈ రోడ్డులో హాకర్ల మధ్య వివాదాలు తలెత్తాయి. వివిధ కూడలి ప్రాంతాల్లో తోపుడు బండ్లు ఏర్పాటు చేస్తు న్నారు. పోలీసులు అప్పుడప్పుడు హడావిడి చేసి వదిలేస్తున్నారు. ఈ రోడ్డులో స్కూల్లో కాలేజీలు ఉండడంతో నిత్యం పరిగతంగా ట్రాఫిక్ ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల నుంచి 6 గంటల వరకు వాహనం కథలని పరిస్థితి కనిపిస్తుంది. రోడ్డు రెండు వైపులా ఆక్రమణకు గురై తగ్గిపోవడమే దీనికి కారణమని అంటున్నారు.

ట్రాఫిక్ పోలీసులు దృష్టి సారించాలి

రోడ్డు ఆక్రమణలతో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. వారం రోజులపాటు ఈ రోడ్డులో వాహనాల ట్రాఫిక్ కు ఇబ్బంది కలగ కుండా ప్రణాళిక రూపొందించాలి. ఆక్రమణదా రులను ఖాళీ చేయించాలి.

ఆక్రమణలు తొలగింపుకు చర్యలు తీసుకుంటాం
చెన్నకేశవరావు, పంచాయతీ కార్యదర్శి, గన్నవరం,

వెంకటేశ్వర థియేటర్ సెంటర్ నుంచి సెయింట్ జోన్స్ వరకు రోడ్డు మార్జిన్ ఆక్రమణలకు గురైన మాట నిజమే. వ్యాపారులు తోపుడుబండ్లను పెట్టి హద్దులు వసూలు చేసుకున్నట్లుగా తమ దష్టికి వచ్చింది. డ్రైనేజీ ఆక్రమించి ముందుకు వచ్చి షాపులు పెట్టేసారు. రోడ్డంతా ఇరుకుగా మారిపోయింది. అనేక ఫిర్యాదులు కూడా వచ్చాయి. ముందుగా ఆగిరిపల్లి రోడ్డు, నేషనల్ హైవేపై ఆక్రమణల తొలగించేందుకు నోటీసులు ఇచ్చాం. ఆ తర్వాత దావాజీగూడెం వెళ్లే రోడ్డులో ఆక్రమణల తొలగింపుకు నోటీసులు ఇస్తాం.

అభివృద్ధి పనులు వెంకట్రామ్ ప్రారంభించడం తగదు : వైసిపి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ప్రభుత్వ నిధులతో నియోజకవర్గంలో జరిగే పనుల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే కుమారుడు తగునా అంటూ వైసీపీ యువ నాయకులు బడే గౌతమ్ ప్రశ్నించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మనం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ద్వారా నిర్మితమైన ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నామా లేక నింతత్వం రాచరికంలో ఉన్నామో అర్థం కావడం లేదన్నారు. ప్రభుత్వ నిధులతో ప్రారంభించే పనులు ప్రారంభోత్సవానికి నిబంధన మేర ప్రజా ప్రతినిధులు లేదా సంబంధిత అధికారులు మాత్రమే అర్హులై ఉండగా నియోజకవర్గంలో మాత్రం యథేచ్ఛగా నిబంధనలు ఉల్లంఘన కొనసాగుతుందన్నారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం నుండి మాజేరు వరకు గుండెలు మేజర్ డ్రైన్‌లో కిక్కిస తొలగింపు పనులను గురువారం ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ తనయుడు వెంకట్రాం ప్రారంభించడం చూస్తుంటే మన నియోజకవర్గంలో ప్రజాస్వామ్యం ఉందా అని అనుమానం కలుగుతోందన్నారు. దీనిపై ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ ప్రజలకు బహిరంగ వివరణ ఇవ్వాలని గౌతమ్ డిమాండ్ చేశారు.



కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి : వందలాది కుటుంబాలతో ముడిపడి ఉన్న ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ తెలిపారు. న్యాయంగా తమకు రావాల్సిన నష్టపరిహారం కోసం కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 101 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కె.వి మోహన్ రావు, సిహెచ్ పిచ్చయ్య, ఆర్ ఇస్రాయెల్, కె ఆదినారాయణ, ఎం గురవయ్య కూర్చున్నారు. దీక్షలను యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండనక, వాననక 100 రోజులు పైబడి కార్మికులు దీక్షలు చేస్తున్న స్థానిక ఎమ్మెల్యే, మరియు మంత్రి నారా లోకేష్ స్పందించకపోవడం పట్ల అసంతప్తి వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఎం ఆశీర్వాదం, డి మాణిక్యరావు, బి అంకయ్య, వై సాల్మన్, వై యెహోషువ, ఎస్ కె సుభాని, వై సుబ్బారావు, ఎండి రహీం తుల్లా, సాంబయ్య , టి దుర్గ భవాని, వై రమాదేవి, ఎస్.కె ఇమాంబి, ఈ సారమ్మ, ఎం శివకుమారి, వి రిబ్కా, డి మల్లేశ్వరి, ఎస్ శాంతమ్మ, దీనమ్మ తదితరులు పాల్గొన్నారు.

మంగళగిరిలో రథోత్సవం

- పాల్గొన్న మంత్రి లోకేష్, కేంద్రమంత్రి పెమ్మసాని

ప్రజాశక్తి మంగళగిరి : వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం నిర్వహించిన మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారి దివ్య రథోత్సవంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పాల్గొన్నారు. స్వామివారి దివ్యరథోత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిగా యాత్రికులు తరలివచ్చారు. పురవీధులు భక్త జనప్రవాహంతో కిక్కిరిసిపోయాయి. రథాన్ని లాగేందుకు అందరూ పోటీపడ్డారు. అర్చకులు స్వామివారికి హారతి ఇచ్చి దివ్య రథోత్సవాన్ని ప్రారంభించారు. అంతకుముందు స్వామివారి రథోత్సవంలో పాల్గొనేందుకు దేవాలయ ప్రాంగణానికి చేరుకున్న మంత్రి నారా లోకేష్ కు, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ కు ఆలయ అధికారులు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి-అవనిగడ్డ : పిఠాపురంలోని చిత్రాడ వద్ద జరిగే జనసేన 12వ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమానికి దివిసీమ నుండి జనసైనికులు వేలాదిగా తరలి వెళ్లారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్, పట్టణ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండా దిమ్మ వద్ద పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం కోర్ట్ సెంటర్లో గత 12 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న చలివేంద్రం ఈ ఏడాది కూడా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మండలి వెంకట్రావు వెంకట్ రామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల కేక్ కట్ చేసి పార్టీ నాయకులు కార్యకర్తలు వీర మహిళా కార్యకర్తలకు పంచిపెట్టి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ ర్యాలీగా చిత్రాల సభకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యా సం చిట్టిబాబు, మాజీ ఎంపీపీ బం డే కనకదుర్గ, టిడిపి నాయకులు బండే రాఘవ, వాణిజ్య విభాగం నియోజకవర్గం అధ్యక్షులు ఘంటసాల రాజమోహన్రావు తదితరులు విచ్చేసి జనసైనికులకు పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, పార్టీ మత్స్యకార విభాగం రాష్ట్ర కార్యదర్శి లంకే యుగంధర్ ,మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు, పార్టీ లీగల్సెల్ జిల్లా కార్యదర్శి వాసు, నాంచారయ్య నాయుడు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, కటికల వసంత్ ,వైద్యశాల డైరెక్టర్ బచ్చు కష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు



చలివేంద్ర ప్రారంభించి 12వ వార్షికోత్సవం కేక్ కట్ చేస్తున్న మండలి వెంకట్రాం జనసేన నాయకులు

లయన్స్ క్లబ్ సేవలు స్ఫూర్తిదాయకం

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రపంచ దేశాల మధ్య శాంతిని, వ్యక్తుల మధ్య సేవా భావాన్ని పెంపొందిస్తున్న లయన్స్ సేవా కార్యక్రమాలలో మరింత మందిని భాగస్వామ్యులను చేయాలనీ లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ గద్దె శేషగిరి స్థానిక అన్నారు. స్థానిక నర్రా రమాదేవి - సాయిబాబు లయన్స్ మల్టీపర్పస్ సర్వీసు సెంటర్లో, లైన్స్ క్లబ్ ఆఫ్ చల్లపల్లి వి ఆర్ కె నగర్ ఆధ్వర్యంలో సావత్సిరిక అధికారిక పరిశీలన, చార్టర్స్ అభినందన వేడులు శుక్రవారం నిర్వహించారు. క్లబ్ ఆధాక్షులు రాయపాటి రాధాకష్ణ అధ్యక్షతన జరిగినసభలో ఆయన మాట్లాడుతూ క్లబ్ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత నేత్ర శిబిరం లోఎనిమిది వేల కంటి ఆపరేషన్ లుచేయించిన ఘనత ఈ క్లబ్ సభ్యులకు దక్కు తుందని అభినందించారు. లయన్స్ క్లబ్ సేవలు నిర్వహించడం కోసం ఇక్కడ మల్టీ పర్పుర్పస్ సెంటర్ ఏర్పాటు చేసుకొని లయన్స్ క్లబ్ సేవలుచేస్తూ ముందుకు సాగుతున్న క్లబ్ సభ్యులకు స్ఫూర్తిదాయకమని క్లబ్ సభ్యుల సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమంలో ఫాస్ట్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వైసీపీ ప్రసాద్, ఫాస్ట్ జీఎటి వైస్ చైర్ పర్సన్ సిహెచ్ శ్రీనివాస్ రెడ్డి, జీఎస్టీ డిస్టిక్ కోఆర్డినేటర్ ఎం చక్రధర్, ఏరియా రిప్రజెంటేటివ్ ఏ ఆర్ కే ప్రసాద్, లయన్స్ క్లబ్ కార్యదర్శి కస్తూరి ప్రసాద్, కోశాధికారి ముమ్మనేని రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఆర్‌కె ప్రసాద్

విద్యుత్ పొదుపుపై అవగాహన

ప్రజాశక్తి తాడేపల్లి రూరల్ : ఒ క యూనిట్ విద్యుత్ పొదుపు, ఒక యూనిట్ విద్యుత్ ఉత్పత్తి కంటే గొప్పదని, రోజు వారీ జీవితంలో అత్యవసరమైన విద్యుత్ ని సమర్థవంతంగా వినియోగించుకోవటం వలన బిల్లు తగ్గటంతోపాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడు తుందని కెఎల్ యూనివర్శిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కెఆర్ఎస్.ప్రసాద్ ప్రజలకు సూచించారు. శుక్రవారం తాడేపల్లి మండలంలోని చిర్రావూరు గ్రామంలో కెఎల్ యూనివర్శిటీ ఎన్ఎస్ఎస్ విభాగం సీఎస్ఈ హానర్స్ ఆధ్వర్యంలో విద్యుత్ పొదుపు, నిర్వహణ అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. ఎల్ఈడీ బల్బులు, ఇన్వర్టర్ టెక్నాలజీ ఉన్న 5 స్టార్ రేటింగ్ ఉన్న గహోపకరణాల వినియోగం, అవసరంలేనిచోట ఫ్యాన్లు, లైట్లు, టీవీలు, ఏసీ, కూలర్లు ఆఫ్ చేసి సూర్యకాంతి వినియోగించటం ద్వారా విద్యుత్ ఆదా చేయవచ్చునని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ పి.శ్రీకాంత్ రెడ్డి ప్రజలకు అవగాహన కల్పించారు. సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేసుకుని సోలార్ వాటర్ హీటర్, సోలార్ లైట్లు వాడితే విద్యుత్ ఖర్చు గణనీయంగా తగ్గించుకోవచ్చునని, ఫ్యాన్ తో కలిపి ఏసీని వాడటం, టెంపరేచర్ 24-26ళీ%జ% వద్ద ఉంచటం, స్మార్ట్ టెక్నాలజీతో ఆటోమెటిక్ విద్యుత్ పరికరాల వినియోగించటం మంచిదని ఆయన వివరించారు. ఎన్ఎస్ఎస్ ఫీల్డ్ కోఆర్డినేటర్ పి.సురేష్, వాలంటీర్లను యూనివర్శిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారధివర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, డాక్టర్ కె.రాజశేఖరరావు, సీఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ సెంథిల్ అథితన్ తదితరులు అభినందించారు.



గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న కెఎల్ యు విద్యార్థులు

ప్రజా సమస్యలపై పోరాటం

ప్రజాచైతన్య యాత్ర దృష్టికి వచ్చిన సమస్యలపై సిపిఎం నాయకులు


నందిగామలో టిడ్కో గృహాల ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డి.వి.కృష్ణ, తదితరులు

ప్రజాశక్తి - నందిగామ : నందిగామలో ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టిడ్కో ఇళ్లు వెంటనే పూర్తి చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సమస్యలపై ప్రజా చైతన్య యాత్రలో భాగంగా శుక్రవారం నందిగామలో హనుమంతుపాలెం గ్రామంలో జి ప్లస్ త్రీ ఇళ్ల నిర్మాణాలను సిపిఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి డివి కృష్ణ మాట్లాడుతూ నందిగామలో ఇల్లు లేని పేదలకు ఇల్లు ఇస్తామని చెప్పి, నిరుపేదల దగ్గర ప్రభుత్వం డిపాజిట్లు ద్వారా మున్సిపల్ అధికారులు వసూలు చేసి ఇంతవరకు ఎక్కడా కూడా ఒక జి ప్లస్ ఇల్లు ప్లాట్ కూడా ఇవ్వకుండా కనీసం వారు ఇచ్చిన డబ్బులు సమాధానం కూడా చెప్పకుండా లబ్ధిదారుల్ని ప్రభుత్వ అధికారులు ఇబ్బంది పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తగా బ్యాంకర్ల ద్వారా జి ప్లస్ త్రీ ఇల్లు పేరుతో మీరు బ్యాంకులో లోన్ తీసుకున్నారన్నారు. లోన్ చెల్లించాలని లబ్ధిదారుల్ని బ్యాంకర్లు భయాందోళన చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడిగితే తమకు సంబంధం లేదంటున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం అధికారులు తక్షణమే స్పందించి ఎవరైతే డీడీ రూపంలో చెల్లించారో, వాళ్ళందరికీ జి ప్లస్ త్రీ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనాసాగరం జగనన్న కాలనీలో నివాసం ఉంటున్న కుటుంబాలకు మంచినీరు, వీధిలైట్లు రోడ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోట కళ్యాణ్, నందిగామ కార్యదర్శి కె.గోపాల్, కమిటీ సభ్యులు సయ్యద్ ఖాసిం, కరి వెంకటేశ్వరరావు, జి.గోపి నాయక్, శ్రీనివాస్, హస్సన్, లాజరు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ : ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం ఆధ్వర్యంలో గంగానమ్మ గుడిరోడ్డు దోబి ఖానా బైరెడ్డి వారి వీధి ప్రాంతాల్లో తిరిగి ప్రజలను కలుసుకొని సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గంగానమ్మ గుడి రోడ్డు గుంతల మయంగా ఉంది. చాలా కాలం నుంచి ఆ రోడ్డు వేయలేదు. ఆ రోడ్డుని వెయ్యాలని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని దోబీఖానాలో కొత్తగా ఒక షెడ్డు నిర్మించాలని కోరారు. ఆ అంశాల్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిపిఎం తరపున అక్కడ ప్రజలకు హామీ ఇచ్చారు. బైరెడ్డి వారి వీధిలో డ్రైనేజీ పొంగుతున్న సందర్భంలో ఆ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం తూర్పు సిటీ కార్యదర్శి వర్గ సభ్యులు బత్తుల చిన్నారావు డివిజన్ పార్టీ కార్యదర్శులు కాయల లక్ష్మణరావు తూబాటి తాండవ కృష్ణ స్థానిక నాయకులు గోకా సూర్యనారాయణ, కొమ్మూరి ఆనంద్, తూలుగు యేసు జూపూడి బాబు పాల్గొన్నారు.


విజయవాడలోని గంగానమ్మ గుడి రోడ్డులో దోబీఖానా పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

విజయవాడ : 57వ డివిజన్‌లో సిపిఎం ప్రజా చైతన్య యాత్రను నిర్వహించారు. న్యూ ఆర్.ఆర్ పేటలో అపార్ట్‌మెంట్స్ ఉన్న ప్రాంతంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు ఎం.బాబూరావు స్థానిక నేతల ఎం.వి.రమణ, టి.శ్రీనుతో కలిసి ప్రజల వద్దకు వెళ్లి వాళ్ళ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎం.బాబూరావు మాట్లాడుతూ దోమల సమస్య, డ్రైనేజీ సమస్య, మంచినీటి సమస్య తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లిన పట్టించుకోవట్లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పక్కా గృహం లేక అనేకమంది అద్దెలకు ఉంటున్నారని ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అపార్ట్మెంట్లు చాలా ఖాళీగా ఉన్నాయని తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకొని వారికి పక్కా గహాలు ఇవ్వాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాగమణి, బుజ్జమ్మ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు : సిపిఎం తిరువూరు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఇర్వహిస్తున్న ప్రజా చైతన్య యాత్ర తిరువూరులో రెండో రోజు శుక్రవారం కూడా కొనసాగింది. భగత్‌సింగ్, సుందరయ్య కాలనీల్లో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పర్యటించి ప్రజల నుండి సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్ పట్టణ ప్రాంతాల్లో ప్రజలు డ్రైనేజీ, తాగు నీటి సమస్యలతో బాధపడుతున్నారని అవేదన వ్యక్తం చేశారు. సుందరయ్య, భగత్ సింగ్ కాలనీల్లో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లకు ఇరువైపులా గ్రావెల్ పోయలేదన్నారు. రోడ్లు వేసిన కాంట్రాక్టర్ గ్రావెల్ పోయకపోతే అధికారులు ఏంచేస్తున్నారని నాగేంద్ర ప్రసాద్ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బి వెంకటేశ్వరరావు ఎస్వీ భద్రం, ఏ. రవి, మోటూరు చింతయ్య, మరకాల ఇస్రాయేలు, చప్పిడి సురేష్, రాము, ఆటో, ముఠా, బిల్డింగ్ కార్మికులు పాల్గొన్నారు.


తిరువూరులో ....



నగరంలో పికిల్ బాల్ కోర్టులు ప్రారంభం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్ : నగరంలోని గాయత్రి నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ది పికిల్ బాల్ కోర్టులను శుక్రవారం సాయంత్రం పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పికిల్ బాల్ క్రీడపై యువకులు విపరీతంగా ఆసక్తి చూపిస్తున్నారని అన్నారు. అమరావతి రాజధాని ప్రాంతంలో ఇలాంటి ఎన్నో అకాడమీలు అందుబాటులోకి రావాలని తెలిపారు. అమరావతిలో రాబోయే రోజుల్లో 220 ఎకరాల్లో స్పోర్ట్స్ సిటీ స్పోర్ట్స్ యూనివర్సిటీ రాబోతున్నాయని తెలిపారు. అమరావతి స్పోర్ట్స్ సిటీలోనే అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మాణం కూడా జరగనుందన్నారు. ఈ కార్యక్రమంలో స్రవంతి, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

శ్రీవాహిణిలో సాంస్కృతిక వేడుకలు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు శ్రీవాహిణి కళాశాలలో ఫీస్టా – 2 కె 24 స్పోర్ట్స్ ఛాంపియన్షిప్, సాంస్కృతిక వేడుకలను ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు శుక్ర వారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రాధాన్యత ఇస్తారో వాళ్ళు జీవితంలో ఉన్నత శిఖరాలధిరోహిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వివిధ క్రీడలలో గెలుపొందిన విద్యార్థులకు ఎంఎల్‌ఎ బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ రంగా నాగేంద్రబాబు, సెక్రటరీ ఊటుకూరు సుబ్రహ్మణ్యం, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వర రావు, ట్రెజరర్ ముత్యాల కిషోర్ బాబు, ఎగ్జిక్యూ టివ్ డైరెక్టర్ పోలిశెట్టి లీలా గోపాలకృష్ణ మూర్తి, డిప్లమో ప్రిన్సిపాల్ వై. కష్ణ, డీన్, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్ష

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్రంలో గల ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్‌లో గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశానికి జరిగే పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు శుక్రవారం మోడల్ పరీక్ష జరిగింది. ఈ పరీక్ష పేపర్‌ను రెవరెండ్ జి.విశ్వనాథ్, రెడ్డిగూడెం వైస్ ఎంపిపి చాట్ల రాబర్ట్ విడుదల చేశారు. ఏప్రిల్‌లో జరిగే పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు విజయ్ కుమార్ చాట్ల, కార్యదర్శి సిహెచ్.హన్న పాల్గొన్నారు

సిఎం సహాయ నిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - నందిగామ : రాజకీయాలకు అతీతంగా సిఎం సహాయనిధి ద్వారా పేద వర్గాలను ఆదుకుంటున్న ప్రభుత్వం తమదని నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. నందిగామ పట్టణం కాకాని నగర్ కార్యాలయంలో శనివారం నందిగామ నియోజకవర్గంలోని 37 మందికి సిఎం సహాయ నిధి ద్వారా రూ.53 లక్షల 30 వేల 633 రూపాయల చెక్కులను ఎమ్మె ల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి, కూటమి నాయకులు లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

గాలి కుంటు వ్యాధి నివారణకు టీకాలు

ప్రజాశక్తి - వత్సవాయి : పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశు వర్ధక శాఖ జెడి ఎం.హనుమంతరావు అన్నారు. మల్లపాడు గ్రామంలో జరిగిన టీకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రైతులకు అవగాహన కల్పించారు. నందిగామ డివిజనల్ డిడి వెస్లీ తదితరులు పాల్గొన్నారు.

లింగాల బ్రిడ్జిని త్వరగా నిర్మించాలి : సిపిఎం

ప్రజాశక్తి - వత్సవాయి :
లింగాల బ్రిడ్జిని త్వరితగతంగా నిర్మించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వత్సవాయిలో సిపిఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో పెట్టుకొని వత్సవాయిలో మంచినీటి సరఫరా చేయాలని అన్నారు. పైపులైన్లు బాగు చేసి మంచినీటిని సరఫరా చేయాలని కోరారు. లింగాల బ్రిడ్జి రెండు రాష్ట్రాలకు వారిధిగా ఉండటంతో నిత్యం వాహనాలు తిరుగుతున్నాయని దీంతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలన్న రావాలన్న ఈ బ్రిడ్జి అనుసంధానంగా ఉండటంతో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని నూతన బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. డ్రైనేజీల సమస్య తీవ్రంగా ఉందని, రహదారులకు మరమ్మతులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు మండే పూడిచంద్రశేఖర్, కంచర్ల కొండయ్య, సిపిఎం మండల సిపిఎం మండల కార్యదర్శి బి.రాము, వెంకయ్య, కరిసే రత్నబాబు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌సిహెచ్.శ్రీనివాస్

పెనుగంచిప్రోలు తిరునాళ్లకు భారీ బందోబస్తు

ప్రజాశక్తి - వత్సవాయి : మండల కేంద్రమైన పెనుగంచిప్రోలులో వేంచేసి ఉన్న శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్లకు 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డిఎస్‌పి మహేశ్వరి రాజు తెలిపారు. ఆయన ఏసీబీ తిలక్, శిక్షణ ఐపీఎస్ మనీషా రెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు, ఎస్సై అర్జునతో కలిసి స్థానిక పరిసరాలు పరిశీలించారు. అనిగండ్లపాడులో పర్యటించి బందోబస్తు ఏర్పాటుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ తిరుణాల సందర్భంగా 30 మంది ఎస్ఐలు,70 హెడ్ కానిస్టేబుల్ 220 మంది కానిస్టేబుళ్లు అదనంగా, 50 మంది ఆర్మీ ఫోర్స్ అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. ఈ తిరు ణాల సందర్భంగా 8 డ్రోన్లు 30 సీసీ కెమెరాలతో రద్దీని క్రమబద్ధీకరిస్తామని తెలిపారు. వత్సవాయమ్మ తిరణాలపై కూడా సమీక్ష సమావేశం నిర్వహించారు ఈ తిరుణాలపై ఏసీపి తిలక్, సి ఐ వెంకటేశ్వర్లు, గ్రామస్తులతో కలిసి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామంలో తిరునాళ్లకు ఎలాంటి అల్లర్లకు గొడవలకు, గ్రామస్తులు కానీ, బయట వారు కానీ పాల్పడవద్దని, సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై ఉమామహేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.


గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎస్‌పి మహేశ్వరి రాజు


వైద్య శిబిరంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - జగ్గయ్యపేట :
పట్టణంలోని (అమెరికన్ ఆసుపత్రి) సెయింట్ ఆన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 250 మంది పేదలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం లక్ష రూపాయలు విలువ చేసే మందులను డాక్టర్స్, నర్సుల ద్వారా ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్‌సిఎం చర్చి ఫాదర్ జయరాజు, సెయింట్ ఆన్స్ హాస్పటల్ సిస్టర్ సుగంధి మాట్లాడుతూ జగ్గయ్యపేట సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌లో నెలలో మొదటి గురువారం ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సేవలను సద్వినియం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిస్టర్స్ జ్యోతి, సునీత, డాక్టర్ అక్సా, స్టాప్, ఆర్.సి.ఎం చర్చి సంఘ పెద్దలు దర్శనాల కమలేష్, అన్నెపాగ సురేష్, దర్శనాల వెంకటరమణ, కొండ రవికుమార్, అన్నెపాగ రమేష్, అన్నెపాగ కిషోర్ బాబు, ముల్లంగి నాగరాజు, కె.మరియమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.